దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747


# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176
epaper : https://varthaprabha.com
సమగ్ర వార్తా దినపత్రిక
Circulated Telangana & Andhra Pradesh States





సంపుటి : 23 | సంచిక : 88 | ది.9-6-2024 | విజయవాడ | ఆదివారం | పేజీలు : 8 | వెల : రూ.3/-



## అక్షర శిల్పి, మీడియా కింగ్ రామోజీరావు

# అస్తమయం



**హైదరాబాద్,జూన్ 8 (వార్తాప్రభ) :** రామోజీ రావు మీడియా ప్రపంచంలో పరిచయం అక్కర్లేని పేరు. భారతదేశపు 'రూపర్ట్ మర్డోక్'గా పేరుగాంచిన చెరుకూరి రామోజీరావు(88) వ్యాపారవేత్తగా, మీడియా బారన్‌గా ప్రసిద్ధి చెందారు. జూన్ 5న గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతూ నానక్ రామాలోని స్టార్ హాస్పిటల్ చేరారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం 4:30 నిమిషాల సమయంలో కన్నుమూసినట్లు డాక్టర్లు ప్రకటించారు. ఈనాడు రామోజీరావు గా జర్నలిజంలో ఉన్నత విలువలను గల సంస్థగా ఈనాడు తో పాటు అనేక సంస్థలు స్థాపించి, వేలాదిమంది కలం యోధులను తయారు చేయడమే కాక, ప్రభుత్వ సంస్థలకన్న మిన్నగా లక్షలాదిమంది ఉద్యోగస్తులకు ఉపాధి కల్పించిన మహనీయులు రామోజీరావు. భారతదేశ మీడియా రంగంలో నిబద్ధతకు మారుపేరుగా అగ్రస్థానంలో రామోజీరావు నిలిచారు.

### కుటుంబ నేపథ్యం..

రామోజీరావు కృష్ణా జిల్లా పెదపారుపూడిలో 1936 నవంబరు 16న రైతు కుటుంబంలో జన్మించాడు. తల్లి వెంకటసుబ్బమ్మ, తండ్రి వెంకట సుబ్బారావు. రామోజీరావు పూర్వీకులు పామర్రు మండలంలోని పెరిశేపల్లి గ్రామానికి చెందినవారు. అతని తాత రామయ్య కుటుంబంతో పెరిశేపల్లి నుంచి పెదపారుపూడికి వలస వచ్చాడు. రామోజీరావు తాత మరణించిన 13 రోజులకు జన్మించాడు. దానితో అతని జ్ఞాపకార్థం తల్లిదండ్రులు రామయ్య అన్న పేరు పెట్టారు. ఇతనికన్నా ముందు ఇద్దరు అక్కలు ఉన్నారు. పెద్దక్క పేరు రాజ్యలక్ష్మి, చిన్నక్క పేరు రంగనాయకమ్మ.

### బాల్యం, విద్యాభ్యాసం, వివాహం (1937 - 1961)

ఇతని కుటుంబానిది శ్రీ వైష్ణవ నేపథ్యం. తల్లి చాలా భక్తిపరురాలు, ఆచారవంతురాలు కావడంతో చిన్నతనంలో ఇతనికీ భక్తి, శుచి అలవడింది. లేకలేక పుట్టిన మగసంతానం కావడంతో రామోజీని చాలా ముద్దుచేసేవారు. పెద్దక్క పెళ్ళిచేసుకుని వెళ్ళిపోయినా చిన్నక్క రంగనాయకమ్మతో సాన్నిహిత్యం ఉండేది. ఇంట్లో తల్లికి ఇంటిపనుల్లో, వంటలో సహాయం చేసే అలవాటూ ఉండేవి. రామయ్య అన్న తన పేరు నచ్చక ప్రాథమిక పాఠశాలలో చేరేప్పుడే స్వంతంగా "రామోజీ రావు" అన్న పేరును సృష్టించుకుని, తానే పెట్టుకున్నాడు. ఆ పేరే జీవితాంతమూ కొనసాగుతోంది. రామోజీరావు 1947లో గుడివాడలో పురపాలకోన్నత పాఠశాలలో 8వ తరగతిలో చేరాడు. 1957లో ఆరవ ఫారం అక్కడే పూర్తిచేసుకుని, గుడివాడ కళాశాలలో ఇంటర్, బీఎస్సీ చదివారు. 1961 ఆగస్టు 19న రామోజీరావుకు, పెనమలూరుకు చెందిన తాతినేని వెంకట సుబ్బయ్య, వాణీదేవిల రెండవ కుమార్తె రమాదేవితో వివాహం జరిగింది. రమాదేవి అసలు పేరు రమణమ్మ కాగా పెద్దలు పెట్టిన పేరు నచ్చక అలా మార్చుకుంది. రామోజీరావుతో భార్య వైపు బంధువుల్లో చిన్న బావమరిది తాతినేని వెంకట కృష్ణారావు మార్గదర్శి చిట్ ఫండ్స్ సంస్థలో డైరెక్టరుగా, తోడల్లుడు ముసునూరు అప్పారావు ఈనాడు, డాల్ఫిన్స్ హెూటల్స్ మాజీ ఎండీగా కలసి పనిచేశారు.

### ఉద్యోగం, వ్యాపారాల ఆరంభం (1960 - 1970)

రామోజీరావు తనకు పరిచయస్తులు, అడ్వర్టైజింగ్ ఏజెన్సీలో పనిచేసేవాడైన తహశిల రామచంద్రరావు ప్రోత్సాహంతో అడ్వర్టైజింగ్ రంగంపై ఆసక్తితో ఆ రంగాన్ని గురించి నేర్చుకోవాలని ఆశించాడు. అందుకోసం చదువు పూర్తయ్యాకా ఢిల్లీలో ఒక అడ్వర్టైజింగ్ ఏజెన్సీలో ఆర్టిస్టుగా ఉద్యోగంలో చేరాడు. మూడు సంవత్సరాల పాటు ఆ రంగంలో పనిచేసి 1962లో హైదరాబాద్ తిరిగివచ్చాడు. రామోజీరావు 1962 అక్టోబరులో హైదరాబాద్‌లో మార్గదర్శి చిట్ ఫండ్ ప్రారంభించాడు. ఇది అతని జీవితంలో తొలి వ్యాపారం. 1965లో కిరణ్ యాడ్స్ అన్న అడ్వర్టైజ్‌మెంట్ ఏజెన్సీ ప్రారంభించాడు. 1967 – 1969 మధ్యకాలంలో ఖమ్మం ప్రాంతంలో వసుంధర ఫెర్టిలైజర్స్ పేరిట ఎరువుల వ్యాపారాన్ని సాగించాడు. 1969లో రామోజీరావు ప్రారంభించిన మొట్టమొదటి పత్రికగా వ్యవసాయ సమాచారంతో సాగే అన్నదాత ప్రారంభించాడు. 1970లో ఇమేజెస్ అవుట్‌డోర్ అడ్వర్టైజ్‌మెంట్ ఏజెన్సీ ప్రారంభించారు..

### పత్రిక నుంచి మొదలై.....

5 దశాబ్దాలకు ముందు ప్రారంభించిన ఈనాడు, నేడు వివిధ రాష్ట్రాలలో దాదాపు 25 ఎడిషన్ లలో ప్రచురించ పడుతూ కోట్లాదిమంది తెలుగు ప్రజల అభిమాన పత్రిక గా మారింది. పత్రిక నుంచి వచ్చిన విపరీతమైన ఆదరణ తర్వాత రామోజీ సినిమా నిర్మాణం వైపు మళ్లారు. 1983లో ఉషాకిరణ్‌మూవీస్ ప్రొడక్షన్ హౌస్‌ని స్థాపించారు. దీని ఆధ్వర్యంలో అనేక తెలుగు చిత్రాలను నిర్మించారు. ఈ బ్యానర్‌లో తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ, మరాఠీ, బెంగాలీ సహా 80కి పైగా విభిన్న భాషల్లో సినిమాలు నిర్మించారు.

### రామోజీ ఫిల్మ్ సిటీ..

రామోజీ ఫిల్మ్ సిటీ ప్రపంచంలోనే అతిపెద్ద ఫిల్మ్ స్టూడియో కాంప్లెక్స్‌గా పరిగణించబడుతుంది. ఇది తెలంగాణ రాజధాని హైదరాబాద్‌కు 25 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ స్టూడియో 2000 ఎకరాల కంటే ఎక్కువ (8.2 చదరపు కిలోమీటర్లు) విస్తీర్ణంలో విస్తరించి ఉంది. ఈ స్టూడియోలో 50 షూటింగ్ అంతస్తులు ఉన్నాయి. ఈ స్టూడియో 1996లో ప్రారంభమైంది. ఇక్కడ ఏకకాలంలో 15 నుంచి 25 చిత్రాలను చిత్రీకరించవచ్చు. సినిమా ప్రీ ప్రొడక్షన్ నుంచి పోస్ట్ ప్రొడక్షన్ వరకు అన్ని సౌకర్యాలు ఇక్కడ ఉన్నాయి. సినిమాలే కాకుండా, ఇది గొప్ప పర్యాటక ప్రదేశం. ప్రతి ఏటా దేశం, ప్రపంచం నలుమూలల నుంచి 10 లక్షల మందికి పైగా పర్యాటకులు వస్తారు.

### ప్రాంతీయ ఛానెళ్ల రారాజు :

భారతదేశంలో ప్రాంతీయ ఛానెల్‌లను ప్రారంభించిన మొదటి వ్యక్తి రామోజీ. నేడు దేశంలోని దాదాపు ప్రతి రాష్ట్రంలో వార్తలను ప్రసారం చేస్తున్నారు. ఈనాడు, ఈటీవీ, ఈటీవీ భారత్ మొబైల్ అప్లికేషన్ సహా తెలుగు టెలివిజన్ పరిశ్రమలో ఈటీవీ మంచి నెట్‌వర్క్‌ను కల్గి ఉంది. దీంతోపాటు జర్నలిజం స్కూల్ కేంద్రాన్ని నిర్వహిస్తూ ప్రత్యేక స్థానాన్ని రామోజీ సంపాదించుకున్నారు.

**అవార్డులు :** మీడియా, జర్నలిజం ప్రపంచానికి ఆయన చేసిన విశేష కృషికి గాను 2016లో ఆయనకు భారతదేశపు రెండో అత్యున్నత పౌర పురస్కారం కూడా లభించింది. అప్పటి రాష్ట్రపతి



ప్రణబ్ ముఖర్జీ పద్మవిభూషణ్‌తో సత్కరించారు. దీనికి ముందు 1985లో ఫిల్మ్‌ఫేర్ ఉత్తమ చలనచిత్ర పురస్కారం (తెలుగు), 1998లో ఫిల్మ్‌ఫేర్ ప్రత్యేక అవార్డు, 2000లో ఫిల్మ్‌ఫేర్ ఉత్తమ చలనచిత్ర పురస్కారం (తెలుగు), జాతీయ చలనచిత్ర పురస్కారం (నిర్మాత), 2004లో ఫిల్మ్‌ఫేర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు లభించాయి.

**ఆపన్న హస్తం :** కరోనా మహమ్మారి సమయంలో 2020లో కష్ట సమయంలో రామోజీ రావు కోవిడ్ రిలీఫ్ కోసం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రుల రిలీఫ్ ఫండ్‌కు రూ. 10 కోట్లు విరాళంగా ఇచ్చారు. అంతే కాకుండా వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజల పునరావాసం అనేక పనులు చేయించారు. దీంతోపాటు అనేక పనుల కోసం విరాళాలు అందించారు.

**సింపుల్ వ్యక్తిత్వం :** రామోజీ చాలా వరకు తెల్లటి హాఫ్ స్లీవ్ షర్ట్, తెల్లటి ప్యాంటు, తెల్లటి షూ వేసుకుంటారు. ఏదైనా పార్టీలు మినహా దాదాపు ఎక్కువగా వీటినే ధరిస్తారు. దాదాపు 12 టీవీ ఛానల్స్, తెలుగు దినపత్రిక యజమాని అయిన రామోజీ రావు మొదటి చూపులో చాలా మామూలుగా కనిపిస్తారు. ఆ మహనీయునికి "వార్తా ప్రభ" ఘన నివాళు లర్పిస్తూ....

### ఆదివారం ఉదయం రామోజీరావు అంత్యక్రియలు..

రామోజీ గ్రూపు సంస్థల ఛైర్మన్ రామోజీరావు అంత్యక్రియలు ఆదివారం జరగనున్నాయి. ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య కుటుంబసభ్యులు అంతిమ సంస్కారాలు నిర్వహించనున్నారు. తెలంగాణ ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే దీనికి సంబంధించిన ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. రామోజీరావు పార్థివదేహం వద్ద నివాళులర్పించేందుకు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు రామోజీ ఫిల్మ్‌సిటీకి చేరుకుంటున్నారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటున్నారు.










## వార్తాప్రభ - పంచాంగం

**ఆదివారము 9-6-2024**

1946 క్రోధి
శ్రీ క్రోధి నామ సంవత్సరం
ఉత్తరాయణం
జ్యేష్ఠ మాసం
శుక్ల పక్షము, గ్రీష్మ ఋతువు

**ఆదివారము, జూన్ 9, 2024**

**రాహుకాలం** - 17:11 నుండి 18:50 వరకు
**యమగండం** - 12:16 నుండి 13:54 వరకు
**అమృత ఘడియలు** - 17:52 నుండి 19:31 వరకు
**దుర్ముహూర్తం** - 16:48 నుండి 17:40 వరకు
**తిథి** - తదియ 15:45 వరకు
**నక్షత్రం** - పునర్వసు 20:20 వరకు

## వార్తాప్రభ - రాశిఫలాలు




ఈరోజు గజలక్ష్మీ యోగం ప్రభావంతో సింహం, తులాతో సహా ఈ 5 రాశులకు ఆకస్మిక ధనలాభం కలగనుంది. మిగిలిన రాశుల వారికి ఎలాంటి ఫలితాలు రానున్నాయంటే...

**మేష రాశి ఫలితాలు..** ఈ రాశి వారికి ఈరోజు చాలా సంతోషకరంగా ఉంటుంది. కుటుంబ సభ్యులకు పదోన్నతి లభించడం వల్ల కుటుంబంలో ఈరోజు సంతోషకరమైన వాతావరణం ఉంటుంది. మీ తెలివితేటలు, విచక్షణతో నిర్ణయాలు తీసుకోవడం ద్వారా ప్రజలను ఆశ్చర్యపరచొచ్చు.

**మిధున రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారికి ఈరోజు గజలక్ష్మీ రాజయోగం ప్రభావం వల్ల అనేక రంగాల్లో శుభ ఫలితాలొస్తాయి. మీరు కొన్ని విలాసవంతమైన వస్తువులను కూడా కొనుగోలు చేయొచ్చు. మీ ఖర్చులు భారీగా పెరిగే అవకాశం ఉంది.

**కర్కాటక రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారు ఈరోజు చాలా ఆలోచనాత్మకంగా ముందుకు సాగాలి. ఉద్యోగులు కార్యాలయంలో శుభ ఫలితాలను పొందుతారు. మీ పనితో అధికారులను ఆకట్టుకుంటారు. దీంతో మీరు ఒత్తిడి లేకుండా ఉంటారు. మీ పిల్లల కెరీర్ గురించి మీరు కొంచెం ఆందోళన చెందితే, ఆ చింత కూడా దూరమవుతుంది.

**సింహ రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారు ఈరోజు సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారు. సమాజంలో మీకు గౌరవం పెరుగుతుంది. ఈరోజు లక్ష్మీదేవి అనుగ్రహం కూడా లభిస్తుంది. మీ ఆత్మవిశ్వాసం కూడా పెరుగుతుంది. మీ జీవిత భాగస్వామితో విభేదాలుంటే, అవి ఈరోజు పరిష్కరించబడతాయి.

**కన్య రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారు ఈరోజు చాలా బాధ్యతాయుతంగా ఉండాలి. మీ ప్రతిభ మెరుగుపడుతుంది. కుటుంబ సభ్యుడు కూడా మీకు కొత్త పని చేయమని సలహా ఇవ్వొచ్చు. మీ తప్పులను పునరావృతం చేయవలసిన అవసరం లేదు. మీరు ఏదైనా ఆస్తితో జాగ్రత్తగా వ్యవహరించాలి.

**తులా రాశి వారి ఫలితాలు..** రాశి వారికి ఈరోజు గజలక్ష్మీ యోగం ప్రభావం కారణంగా శుభ ఫలితాలొస్తాయి. మీ ఆదాయం పెరిగే అవకాశం ఉంది. ఆరోగ్య పరంగా కొంత ఇబ్బంది ఉంటుంది. వ్యాపారులు భారీగా ఆర్థిక లాభాలను పొందొచ్చు. మీ పిల్లల భవిష్యత్తుకు సంబంధించి ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకోవచ్చు.

**వృశ్చిక రాశి ఫలితాలు..** ఈ రాశి వారికి ఈరోజు చాలా విషయాల్లో అదృష్టం కలిసొస్తుంది. ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో పాలుపంచుకునే అవకాశం ఉంటుంది. రాజకీయ రంగంలో పని చేసే వ్యక్తులు ఈరోజు పెద్ద పదవిని పొందుతారు. మీ నాయకత్వ సామర్థ్యాలు పెరిగేకొద్దీ మీరు సంతోషంగా ఉంటారు.

**ధనస్సు రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారు ఈరోజు ఆరోగ్య పరంగా కొంత ఇబ్బంది పడతారు. మీరు కొన్ని ముఖ్యమైన చర్చల్లో కూడా పాల్గొనాల్సి ఉంటుంది. మీ పాత స్నేహితుడు చాలా కాలం తర్వాత మిమ్మల్ని కలవడానికి రావొచ్చు. మీరు వ్యాపారంలో చిన్న లాభాల కోసం అవకాశాలను పొందడం కొనసాగిస్తారు.

**మకర రాశి వారి ఫలితాలు ..** ఈ రాశి వారు ఈరోజు పరస్పర సహకారం పొందుతారు . మీరు భాగస్వామ్యంతో పని చేయడం మంచిది. మీ కుటుంబంలో కొత్త అతిథి రాకతో మీ ఆనందానికి అవధులు ఉండవు. మీ స్నేహితులు, సహోద్యోగులపై నమ్మకాన్ని కొనసాగించాలి.

**కుంభ రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారు ఈరోజు లావాదేవీలలో జాగ్రత్తగా ఉండాలి. మీరు తొందరపాటుతో వ్యవహరిస్తే, మీరు భారీ నష్టాన్ని చవిచూడొచ్చు. మీరు కార్యాలయంలో కొన్ని సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. వాటికి మీరు భయపడకూడదు.

**మీన రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారు ఈరోజు చాలా శక్తివంతంగా ఉంటారు. మీరు ఆ శక్తిని సరైన పనుల్లో ఉపయోగిస్తే మంచిది. మీ మనస్సులో సంతోషంగా ఉంటారు. ఈ కారణంగా మీరు ప్రతి పనిని చేయడానికి, ముఖ్యమైన విషయాలలో ముందుకు సాగడానికి సిద్ధంగా ఉంటారు. విద్యార్థులు చదువులో కొన్ని సమస్యలను ఎదుర్కొంటే వారికి ఈరోజు ఉపశమనం లభిస్తుంది.

## అక్షరమే ఆయుధంగా చెడుపై విజయం సాధించిన మీడియా మొఘల్ రామోజీ రావు



**అమరావతి, జూన్ 8 (వార్తాప్రభ) :** ప్రజాశ్రేయస్సు ధ్యేయంగా వేలమందిని జర్నలిస్టులను తీర్చిదిద్ది చెడుపై అక్షర యుద్ధం చేసి మంచికి స్థానం కల్పించి మీడియా మొఘల్ గా రాణించిన వ్యక్తి చెరుకూరి రామోజీ రావు అని మాజీ టీడీపీ మీడియా కమిటీ ఛైర్మన్ ఎల్వీఎస్ఆర్కే ప్రసాద్ శ్లాఘించారు. అటు కేంద్రంలోనూ, ఇటు ఏపీలోనూ ప్రజా ప్రభుత్వాలు ఏర్పడ్డాయని తెలుసుకున్నప్పటికీ..రామోజీ రావు గారు మరికొన్ని సంవత్సరాలు జీవించి ఉండాల్సిందని ప్రసాద్ ఆకాంక్షించారు. కేంద్రంలో ప్రధానిగా మోడీ, ఏపీలో సీఎంగా చంద్రబాబుల ప్రమాణ స్వీకార మహోత్సవాలు తిలకించినట్లయితే ఆయన ఆకాంక్షలు నెరవేరి మానసికంగా సంతోషంగా ఉండేవారని ప్రసాద్ అన్నారు. ఈనాడు రామోజీ రావు గారి జీవిత కథ ఎంతో ప్రేరణతో నిండి ఉందన్నారు. ఈనాడు దినపత్రికను ప్రారంభించి తెలుగునాట సంచలనం సృష్టించారు. అహంకార ప్రభుత్వ నేతలపై మొక్కవోని దీక్షతో ప్రజల తరపున పోరాటం చేశారన్నారు..నిరంతరం ప్రజలకు అండగా, సమాజంలో చెడుపై యుద్ధ చేయడంలో రామోజీ రావు అనేక విజయాలను చవిచూశారన్నారు. రామోజీ రావు ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు.

## రామోజీరావు మృతి దిగ్భ్రాంతి కలిగించింది - వైయస్ జగన్..



**తాడేపల్లి,జూన్ 8 (వార్తాప్రభ) :** మీడియా దిగ్గజం రామోజీరావు మరణం దిగ్భ్రాంతికి గురిచేసిందని మాజీ సీఎం జగన్ తెలిపారు. తెలుగు పత్రికా రంగానికి ఆయన ఎనలేని సేవలందించారని కొనియాడారు. 'ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను.రామోజీరావు గారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను' అని వైఎస్ జగన్ ట్వీట్ చేశారు..

## తెలుగు ప్రజల జీవితాల్లో రామోజీ ఒక విడదీయలేని భాగం: జస్టిస్ ఎన్వీ రమణ

**విజయవాడ,జూన్ 8 (వార్తాప్రభ) :** తెలుగు పాత్రికేయ రంగానికి కొత్త ఒరవడి దిద్దిన అక్షర యోధుడు రామోజీరావు. కొంతకాలంగా గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న రామోజీ రావు తుదిశ్వాస విడిచారు. రామోజీరావు మృతి పట్ల సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ ఎన్వీ రమణ స్పందించారు. మరణం పట్ల ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్టు వెల్లడించారు. తెలుగు ప్రజల జీవితాల్లో రామోజీ ఒక విడదీయలేని భాగం అని అభివర్ణించారు. ఉదయం నుంచి రాత్రి నిద్రించే వరకు తెలుగు ప్రజల జీవితాలతో రామోజీ మమేకమై ఉన్నారని జస్టిస్ ఎన్వీ రమణ వివరించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ దిశగా ప్రజల కోసం అలుపెరగని పోరాటం చేసిన సిసలైన యోధుడు రామోజీరావు అని కీర్తించారు.

# రేపు ప్రధాన మోడీ ప్రమాణస్వీకారం

● భారీ భద్రతా ఏర్పాట్లు





**న్యూఢిల్లీ,జూన్ 8 (వార్తాప్రభ) :** భారత ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ మూడోసారి ప్రమాణ స్వీకారోత్సవానికి ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. రేపు (జూన్ 9న) ఢిల్లీలో జరగనున్న ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భద్రతా ఏర్పాట్లు జరుగు తున్నాయి. ఐదు కంపెనీల పారామిలిటరీ బలగాలు, ఎన్ఎస్జీ కమాండోలు డ్రోన్లు, స్నైపర్లతో బహుళ స్థాయి భద్రతను ఏర్పాటు చేశారు. ఇక, రేపు మూడోసారి దేశ ప్రధాని గా మోడీ రాష్ట్రపతి భవన్‌లో ఆదివారం రాత్రి 7. 15 గంటలకు ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. ఇక, ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో భారత్‌తో పాటు ప్రపంచంలోని పలు దేశాలకు చెందిన ప్రముఖులు కూడా పాల్గొనే అవకాశం ఉంది. ఈ కార్యక్రమానికి సార్క్ (సౌత్ ఏషియన్ ఆర్గనైజేషన్ ఫర్ రీజినల్ కో-ఆపరేషన్) దేశాల అతిథులను ఆహ్వానించారు. అలాగే రేపు జరగబోయే ప్రమాణ స్వీకారోత్సవానికి వచ్చే అతిథులు హోటల్‌కు వెళ్లే మార్గం పూర్తిగా సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఇదే కార్యక్రమానికి పొరుగు దేశాలైన భూటాన్, మాల్దీవులు, శ్రీలంక, నేపాల్, మారిషస్, సీషెల్స్ దేశాల నేతలు మోడీ ప్రమాణస్వీకారోత్సవానికి హాజరవుతున్నారు.

**ప్రత్యేక అతిథులు..:** మోడీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేయనున్న కార్యక్రమానికి స్పెషల్ గెస్టులు రానున్నారు. నూతన పార్లమెంట్ నిర్మాణంలో భాగస్వాములైన శ్రామికులు, ట్రాన్స్‌జెండర్లు, పారిశుద్ధ్య కార్మికులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించినట్లు తెలిపారు. అలాగే భారత దేశాభివృద్ధికి తోడ్పడుతున్న వీరందరినీ మోడీ తన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఇప్పటికే వివిధ దేశాధినేతలు తమకు ఆహ్వానాలు అందినట్లుగా ప్రకటించారు. కూటమి నాయకులు, విదేశీ నేతలు, ప్రతిపక్ష సభ్యులు, సినీ, క్రీడారంగ ప్రముఖులు, అగ్రశ్రేణి పారిశ్రామికవేత్తలతో సహా మరికొంత మందిని ముఖ్య అతిథులుగా ఆహ్వానించనున్నట్లుగా అధికారులు తెలిపారు. ఈ జాబితాలో పలువురు ట్రాన్స్‌జెండర్లు, కొత్త పార్లమెంటు భవన నిర్మాణానికి పని చేసిన శ్రామికులు, పారిశుద్ధ్య కార్మికులు, వందే భారత్ రైళ్లు వంటి కీలక ప్రాజెక్టుల్లో పని చేసిన వారికి అవకాశం కల్పించినట్లు చెప్పారు. 'ప్రధానమంత్రి మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి భారత రాజకీయాల్లో చాలా మార్పులు చోటుచేసుకొన్నాయి. బలమైన దేశ నిర్మాణంలో పాలుపంచుకున్న ప్రతిఒక్కరి సహకారాన్ని ఆయన గౌరవిస్తారు. వీఐపీలు, వీవీఐపీలకు మాత్రమే ఆహ్వానాలు పంపే రోజులు పోయాయి. మా పీఎం అట్టడుగు వర్గాల్లో వారిని కూడా వీఐపీలుగానే చూస్తారు" అని కూటమి వర్గాలు తెలిపాయి.

## విశ్వసనీయతకు పెద్దపీటవేసిన రామోజీ రావు

● తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం

**అమరావతి,జూన్ 8 (వార్తాప్రభ) :** తెలుగు పత్రికా దిగ్గజం, ఈనాడు గ్రూప్స్ అధినేత, పద్మవిభూషణ్ గ్రహీత చెరుకూరి రామోజీరావు మరణం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన మరణం తెలుగు పత్రికా, మీడియా, వ్యాపార రంగాలకు తీరని లోటని ముఖ్యమంత్రి అన్నారు. తెలుగు జర్నలిజానికి విశ్వసనీయతను, తెలుగు మీడియా రంగానికి కొత్త పంథాను నేర్పిన ఘనత రామోజీరావుకి దక్కుతుందన్నారు. రామోజీరావు తెలుగువారి కీర్తిని దేశ స్థాయిలో చాటిన వ్యక్తిగా సీఎం కొనియాడారు. రంగం ఏదైనా విలువలకు, విశ్వసనీయతకు పెద్దపీట వేసిన వ్యక్తి రామోజీరావు అన్నారు. పత్రిక నిర్వహణ ఒక సవాల్ అనుకునే పరిస్థితుల్లో ఐదు దశాబ్దాల పాటు ఈనాడు పత్రికను నెంబర్ వన్ స్థానంలో నడపడం, ఈటీవీ స్థాపనతో టీవీ మీడియా రంగానికి దశాదిశా చూపిన దార్శనికుడు రామోజీరావు అని సీఎం అన్నారు. ఇటీవలే రామోజీ ఫిల్మ్ సిటీలో రామోజీరావు తో భేటీ ఐన విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు గుర్తు చేసుకున్నారు. రామోజీరావు లేని లోటు తెలుగు మీడియా రంగానికి, వ్యాపార రంగానికి తీరని లోటు అని సీఎం అన్నారు. అక్షర వీరుడు రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని ప్రార్థిస్తూ ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## బహుముఖ ప్రజ్ఞాశాలి రామోజీ రావు

● అక్షరానికి సామాజిక బాధ్యత ఉందని నిరూపించారు

● జనసేన అధినేత పవన్ కళ్యాణ్



**విజయవాడ, జూన్ 8 (వార్తాప్రభ) :** అక్షర యోధుడు రామోజీ రావు తుది శ్వాస విడిచారని తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యానని జన సేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. అస్వస్థతతో ఆసుపత్రిలో చేరారని తెలిశాక కోలుకొంటారని భావించాను. రామోజీ రావు ఇక లేరనే వార్త ఆవేదన కలిగించింది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. శ్రీ రామోజీరావు స్థాపించిన ఈనాడు పత్రిక భారతీయ పత్రికా రంగంలో పెను సంచలనమే. అక్షరానికి సామాజిక బాధ్యత ఉందని నిరూపించారు. ప్రజా పక్షం వహిస్తూ వాస్తవాలను వెల్లడిస్తూ, జన చైతన్యాన్ని కలిగించారు. వర్తమాన రాజకీయాలపై, పాలన తీరుతెన్నులపై నిష్కర్షగా వార్తలను అందించడమే కాదు. ఆ వార్తలను ఉషోదయానికి ముందే పాఠకుడికి చేరేలా వ్యవస్థను ఏర్పాటు చేయడం రామోజీరావు దక్షతను తెలియచేసింది. ప్రజా ఉద్యమాలకు వెన్నుదన్నుగా నిలిచారు. పత్రికాధిపతిగానే కాకుండా సినీ నిర్మాతగా, స్టూడియో నిర్వాహకులుగా, వ్యాపారవేత్తగా బహుముఖంగా విజయాలు సాధించారు. రామోజీ ఫిల్మ్ సిటీ నిర్మాణంతో భారతీయ చిత్ర పరిశ్రమకు హైదరాబాద్ ను వేదికగా చేశారు. మీడియా మొఘల్ గా రామోజీరావు అలుపెరుగని పోరాటం చేశారు. తను నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి ముందుకు వెళ్ళడం ద్వారా ప్రజల్లో విశ్వసనీయత సాధించారు. అక్షర యోధుడు రామోజీ రావు అస్తమయం తెలుగు ప్రజలందరినీ కలచి వేస్తోంది. ఆయన స్ఫూర్తిని నవతరం పాత్రికేయులు అందిపుచ్చుకోవాలి. రామోజీరావు కుటుంబానికి నా తరపున, జనసేన పక్షాన ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నా అని పవన్ కళ్యాణ్ నివాళి అర్పించారు.

## క్రమశిక్షణకు మారుపేరు రామోజీ రావు - మాజీ మంత్రి హరీష్ రావు





**హైదరాబాద్,జూన్ 8 (వార్తాప్రభ) :** రామోజీ రావు మృతి దిగ్భ్రాంతికి గురి చేసింది. తెలుగు ప్రజలకే కాదు దేశానికి తీరని లోటు అని మాజీ మంత్రివర్యులు హరీష్ రావు పేర్కొన్నారు. సాధారణ వ్యక్తిగా ప్రారంభమైన ఆయన జీవితం అందరికీ ఆదర్శం. నిరంతర శ్రమ, నిత్యం కొత్తదనం కోసం తపన, చెదరని ఆత్మస్థైర్యం, నిబద్ధత, క్రమశిక్షణ కలగలిసిన గొప్ప వ్యక్తి ఆయన అని అన్నారు. తెలుగు వాడి సత్తాను యావత్ ప్రపంచానికి చాటి చెప్పిన రామోజీరావు చిరస్మరణీయులను, పత్రిక, టీవీ, సినిమా తదితర రంగాల్లో రామోజీరావు సాధించిన విజయాలు ఆయనకు మాత్రమే కాకుండా యావత్ తెలుగు జాతికి గర్వకారణం. అక్షరానికి సామాజిక బాధ్యత ఉందని నిరూపించారన్నారు. సమాజ హితం కోసం మీడియా ద్వారా కృషి చేశారనీ,ఏ రంగంలో అడుగుపెట్టినా తనదైన ముద్ర వేశారన్నారు. ప్రతి వ్యాపారంలో అగ్రగామిగా నిలిచారనీ, ఒక చిరుద్యోగిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన రామోజీ రావు.. వేల మందికి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదిగారన్నారు. ఎంతో మంది కుటుంబాల్లో వెలుగు నింపారనీ, తెలుగు భాషను కాపాడేందుకు ఆయన చేసి కృషి ఎంతో గొప్పదన్నారు. జర్నలిజం, సాహిత్య రంగాల్లో ఆయన చేసిన కృషి గొప్పదనీ,సమాజ సేవ చేసి ఎంతో మంది గుండెల్లో నిలిచిపోయారన్నారు. కుటుంబ సభ్యులకు, సన్నిహితులకు తన ప్రగాఢ సానుభూతి,అని, రామోజీ రావు ఆత్మకు శాంతి చేకూరాలని హరీష్ నివాళి అర్పించారు.

## రాష్ట్ర ప్రభుత్వం తరపున దివంగత రామోజీరావు పార్థివ దేహానికి నివాళులు అర్పించిన సిఎస్.



**అమరావతి,జూన్ 8 (వార్తాప్రభ) :** రామోజీ సంస్థల అధినేత దివంగత రామోజీరావు పార్థివ దేహానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున శనివారం హైదరాబాదులో రామోజీ ఫిలిమ్ సిటీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ నివాళులు అర్పించారు.



రామోజీ గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు పార్థీవదేహానికి నివాళులర్పించిన టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, భువనేశ్వరి తదితరులు

-హైదరాబాద్,జూన్ 8 (వార్తాప్రభ) :



రామోజీ గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు పార్థివదేహానికి నివాళులర్పించిన టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, బ్రాహ్మణి.

-హైదరాబాద్,జూన్ 8 (వార్తాప్రభ) :

## ఆయన జీవితం ఒక ప్రభంజనం.. ఆయన కలం విప్లవ కెరటం

● డా. మండలి బుద్ధప్రసాద్, ఎమ్మెల్యే




**విజయవాడ,జూన్ 8 (వార్తాప్రభ) :** ఈనాడు గ్రూపుల అధినేత రామోజీరావు మరణంతో తెలుగుజాతి ఒక మహోన్నత దిగ్గజాన్ని కోల్పోయింది. పట్టుదల, దృఢదీక్ష, మనో నిబ్బరంతో సామాన్య స్థితి నుంచి అసమాన్య స్థితికి ఎదిగిన ఆయన జీవితం ఒక వ్యక్తిత్వ వికాస గ్రంథం.. భావితరాలకు మార్గదర్శకం. పత్రికారంగ చరిత్రలో ఈనాడు పత్రిక, ఈటీవీ ఒక సంచలనం. సినీ రంగ చరిత్రలో రామోజీ ఫిలిం సిటీ ఒక అద్భుతం. వ్యాపార రంగంలో మార్గదర్శి చిట్ ఫండ్, ప్రియా పచ్చళ్ళు... ఆయన ఏది చేపట్టిన బంగారమయింది.. 1977 ఉప్పెన సమయంలో దివిసీమ దీనగాధలను లోకానికి చాటి చెప్పి, ఈనాడు సహాయ నిధి ద్వారా రూ. 3,73,927/- సేకరించి పాలకాయతిప్పలో 112 ఇళ్ళు, కృష్ణాపురంలో 22 ఇళ్ళు రామకృష్ణమిషన్ ద్వారా నిర్మింపచేశారు. పాలకాయతిప్ప కు వారు వచ్చినప్పుడు వారిని అవనిగడ్డ గాంధీ క్షేత్రానికి తీసుకువచ్చి అనాధ పిల్లల శరణాలయాన్ని చూపించాను. అది వారిని కలుసుకున్న మొదటి సందర్భం. ఆ తరువాత తెలుగు భాషా పరిరక్షణలో వారు నన్ను వెన్ను తట్టి ప్రోత్సహించారు. నేను అధికార బాషా కమిషన్ అధ్యక్షుడినైనప్పుడు వారు అందించిన సహకారం అంతా ఇంతా కాదు. వారు జీవించి ఉన్న కాలంలో తెలుగు మసక బారుతుంటే బాధ కలుగుతుందని, ఎలాగైనా తెలుగుని నిలబెట్టాలని అనేవారు. తెలుగు భాషా పరిరక్షణకు వారు చేసిన కృషి మహత్తరమైనది. ఆంగ్ల పదాలకు తగిన తెలుగు పదాలను సృష్టింపచేసి ఈనాడు ద్వారా వ్యాప్తికి తెచ్చారు. ఒక మహా నిఘంటు నిర్మాణానికి కూడా శ్రీకారం చుట్టారు. తెలుగు జాతి వైభవోన్నతికి కృషి చేసిన మహోన్నతమైన వ్యక్తి రామోజీరావు. నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా, ప్రజాస్వామ్య పరిరక్షణకు అలుపెరుగని పోరాటం చేసిన అక్షర యోధుడు రామోజీరావు. తెలుగుజాతికి సవాళ్లు ఎదురైనప్పుడు ధీటుగా ఎదిరించి నిలబడిన మహోన్నత ధైర్యశాలి. ఆయన జీవితం ఒక ప్రభంజనం.. ఆయన కలం విప్లవ కెరటం. వారి మరణం తెలుగు జాతికి తీరనిలోటే కాకుండా వ్యక్తిగతంగా ఒక హితైషిని కోల్పోయాను. వారికి ఆత్మశాంతి కలగాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

## ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు మృతిపట్ల టీడీ జనార్థన్ దిగ్భ్రాంతి

**అమరావతి,జూన్ 8 (వార్తాప్రభ) :** పత్రిక, టీవీ, సినిమా రంగాల్లో తనదైన ముద్రవేసి తెలుగువారి ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా ఇనుమడింపచేసిన చెరుకూరి రామోజీరావు మృతి పట్ల టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు టీడీ జనార్ధన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సామాన్య కుటుంబంలో జన్మించి క్రమశిక్షణతో అంచెలంచెలుగా ఎదిగిన రామోజీరావు జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని కొనియాడారు. ఈనాడు గ్రూపు సంస్థల ద్వారా లక్షలాది మందికి ఉద్యోగాలు, ఉపాధి కల్పించారన్నారు. ఈనాడు పత్రిక స్థాపన ద్వారా మీడియా రంగంలో నూతన్య అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. రామోజీరావు మృతి తెలుగువారికి తీరని లోటని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

# అలరించిన శ్రీదేవి రాజనాల శిష్య బృంద కూచిపూడి ప్రదర్శన



**శేరిలింగంపల్లి,జూన్ 8 (వార్తాప్రభ):** మాదాపూర్ లోని శిల్పారామం లో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం శ్రీదేవి రాజనాల శిష్య బృందం చే కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. భామ ప్రవేశం,రుక్మిణి ప్రవేశం, కొలువైతివరంగశాయి,గణేశా పంచరత్న, అతినిరుపమా, బృందావన నిలయేహ్, నమశ్శివాయతేయ్, ఒకపరికొకపరి,కృష్ణం కలయసఖి,సంగీత సామ్రాజ్య, ఇదిగో భద్రాద్రి మొదలైన అంశాలను మయూరి నృత్యాలయాల కళాకారులూ ప్రదర్శించి మెప్పించారు.

# అక్షర యోధుడు అస్తమయం - గాలి బాలాజీ




**కూకట్ పల్లి, జూన్ 8 (వార్తాప్రభ):** ఈనాడు గ్రూప్స అధినేత, పద్మవిభూషణ్ చెరుకూరి రామోజీరావు స్వర్గస్తులైన సందర్భంగా కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ తరపున కె పి హెచ్ బి టెంపుల్ బస్టాండ్ వద్ద గాలి బాలాజీ ఘన నివాళులు అర్పించటం జరిగింది. ఈ సందర్భంగా గాలి బాలాజీ మాట్లాడుతూ పారిశ్రామిక దిగ్గజం మీడియా రంగం లో అనేక మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించి లక్షలాది మందికి ప్రత్యక్షం గా కానీ పరోక్షంగా గానీ ఉపాధి కల్పించిన దర్శనికుడు రామోజీరావు అని ఆయన కీర్తి కి మరణం లేదని టి.పి సి.సి కొ ఆప్షన్ సభ్యులు గాలి బాలాజీ కొనియాడటం జరిగింది. ఈ కార్యక్రమంలో కె పి హెచ్ బి డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, అరవిందరెడ్డి, కె. రామారావు,ముఖ్ధామ్, రాజేష్ గౌడ్, అట్లూరి దీపక్, సంధ్య రాణి, పిడికిటి గోపాల్ చౌదరి, సాయి, నవీన్,బాలు,తదితరులు పాల్గున్నారు.

## ప్రజా సంక్షేమం కొరకై నిత్యం ప్రజల్లో ఉండే నాయకుడు ఎమ్మెల్యే కేపీ.వివేకానంద



**కుత్బుల్లాపూర్ జూన్ 8 (వార్తాప్రభ)** : కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శనివారం ఎమ్మెల్యే కేపీ.వివేకానంద ని కలిసి కాలనీలలో నూతనంగా చేపట్టవలసిన అభివృద్ధి పనులపై పలు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ.వివేకానంద మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధికి కొనసాగింపుగా రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు.

# నూతనంగా "లిటిల్ విల్లే" ప్రీమియం ప్లే స్కూల్ ను ప్రారంభోత్సవం



**నిజాంపేట్ జూన్ 8 (వార్తాప్రభ)** : బాచుపల్లి లోని శ్రీ హెూమ్స్ నందు బొంకూరు పావని ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన "లిటిల్ విల్లే" ప్లే స్కూల్ ను శనివారం ఎమ్మెల్యే కేపీ.వివేకానంద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ.వివేకానంద మాట్లాడుతూ పిల్లలు విద్యాబోధనను ఇష్టంగా ప్రారంభించడంలో ప్రీస్కూల్ లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షులు రంగా రాయ ప్రసాద్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# చేప మందు పంపిణీలో విషాదం

## తొక్కిసలాట జరిగి ఒక వ్యక్తి మృతి



**హైదారాబాద్ :జూన్ 8 ( వార్త ప్రభ ప్రతినిధి ):** హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జరుగుతున్న చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమంలో విషాదం చోటుచేసుకుంది. క్యూ లైన్లో నిలబడ్డ ఓ వ్యక్తి తోపులాటలో సొమ్మసిల్లి పడిపోయాడు. వెంటనే అక్కడి వారు ఆస్పత్రికి తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు నిజామాబాద్ జిల్లా వాసిగా పోలీసులు గుర్తించారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఆలయ అభివృద్ధికి హనుమాన్ భక్తులు విరాళం అందించడం అభినందనీయం

- పాపిరెడ్డి నగర్ బస్తీ అధ్యక్షుడు చంద్ర రెడ్డి
- రూ.35,500/- వంట సామగ్రి అందజేత..



**కూకట్ పల్లి, జూన్ 8 (వార్తాప్రభ):** కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ లోని శ్రీశ్రీశ్రీ వీరాంజనేయ శివాలయం అభివృద్ధికి హనుమాన్ దీక్ష బూనిన స్వాములు తమ వంతు విరాళంగా రూ.35,500/- (ముప్పై ఐదు వేల ఐదు వందలు) లతో వంట సామగ్రి ని అందించడం అభినందనీయమని బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్ర రెడ్డి , ఆలయ కమిటీ అధ్యక్షుడు పేర్ని ధర్మారావు అన్నారు . గత 41 రోజులుగా హనుమాన్ దీక్ష చేపట్టిన హనుమాన్ భక్త బృందం స్వాములు జూన్ 1న హనుమాన్ జయంతి సందర్భంగా దీక్ష విరమణ చేశారు . సుమారు 70 మంది హనుమాన్ భక్తులు నిత్యం పూజలు చేసుకునేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లను చేసి సహకరించిన సందర్భంగా ఆలయ అభివృద్ధిలో పాలుపంచుకునేందుకు స్వాములందరూ కలిసి ఆలయానికి కావలసిన పలు వంట సామాగ్రిని శనివారం ఆలయ కమిటీ, బస్తీ కమిటీ సభ్యులకు అందజేశారు . ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ హనుమాన్ దీక్ష చేపట్టిన స్వాములు ప్రతి ఏడు మాల విరమణ అనంతరం ఆలయానికి కావలసిన సామాగ్రిని ఇతర వస్తువులను అందజేస్తూ ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు అన్నారు. ప్రతి ఒక్కరికి శ్రీ సీతారామాంజనేయ స్వామి కరుణాకటాక్షాలు సిద్ధిస్తూ అభివృద్ధి చెందాలని ఈ సందర్భంగా వారు కోరారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మెన్ గడ్డం రాజేశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దొడ్ల రాంరెడ్డి, కోశాధికారి కిరణ్ కుమార్ , బస్తి ప్రధాన కార్యదర్శి భగవంత రెడ్డి, కోశాధికారి నర్సింహులు ముదిరాజ్ , సభ్యులు చర్ల రామకృష్ణారెడ్డి ,అనంత రాములు, దశరథ్ , తిరుపతి రెడ్డి , తడకల రాజిరెడ్డి గురు స్వాములు కృష్ణారెడ్డి, మారుజోడు శంకర్, కుల్ల రాజు, మినుముల శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ చారి, ఎల్లకొండ జయకుమార్ గుప్త,మహేందర్, జగన్ మోహన్ రావ్,అజేయ్, శ్రీకాంత్, హరి, పుష్కన్ రెడ్డి, యాదగిరి తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# విశ్వకర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివాహ పరిచయ వేదిక



**కుత్బుల్లాపూర్ జూన్ 8 (వార్తాప్రభ)** : పెళ్ళి సంభందాలు కుదుర్చుకునే తల్లిదండ్రులకు విశ్వకర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే వివాహ పరిచయ వేదికలు ఎంతో దోహద పడుతున్నాయని ఫౌండేషన్ అధ్యక్షులు అడ్లూరి రవీంద్ర చారి తెలిపారు. విశ్వకర్మ ఫౌండేషన్ అధ్యక్షులు అడ్లూరి రవీంద్ర చారి ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్, చింతల్, శ్రీసాయి కాలనీ లోని శ్రీ అభయ అంజనేయ, పోచమ్మ అమ్మ వారి ఆలయ ప్రాంగణంలో విశ్వకర్మ ఆత్మీయ సమావేశం, ఉచిత వివాహ పరిచయ వేదిక శ్రీ సాయి కాలనీ ఫౌండర్ ,ప్రెసిడెంట్ కన్నెకంటి



పాండు రంగా చారి(ఐడిపిఎల్ పండరి) కుటుంబ సభ్యుల సహకారంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వకర్మ విశ్వ బ్రాహ్మణ జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షులు మాజోజు నరసింహాచారి, ఉపాధ్యక్షులు కన్నకంటి లక్ష్మణాచారి, పెద్ద ఎత్తున విశ్వకర్మ బంధువులు హాజరైయ్యారు. తల్లిదండ్రులు తమ పిల్లల బయోడేటా తెలిపి వారు పరిచయం చేసుకున్నారు. సుమారు 200 మంది విశ్వకర్మీయులు తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# శ్రీ ధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయ వార్షికోత్సవం



**నిజాంపేట్ జూన్ 8 (వార్తాప్రభ)** : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 7, 26వ డివిజన్ పరిధి శ్రీనివాస్ నగర్ లో శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయ ఛైర్మెన్ కోలన్ చంద్రశేఖర్ రెడ్డి డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, స్థానిక కార్పొరేటర్ ప్రణయ ధనరాజ్ యాదవ్, రాఘవేంద్ర రావు, శ్రీదర్మశాస్త్ర అయ్యప్ప స్వామి కమిటీ సభ్యులు, బ్రహ్మశ్రీ ఏవి ఉన్నిక్రిష్ణన్ నంబూద్రి మెల్సంతి, శ్రీనివాసనగర్ కాలనీ అయ్యప్ప దేవాలయ ప్రధాన అర్చకులు నాగార్జున ఆచార్యులు (లాలుస్వామి) ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా శ్రీదర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ప్రధమ వార్షికోత్సవ వేడుకలకు హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద ముఖ్య అతిధులుగా పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ. వివేకానంద మాట్లాడుతూ మహిమాన్విత దైవం అయ్యప్ప స్వామిని కొలవడం ద్వారా ఆపదలు తొలగుతాయని, శరణాంటూ వచ్చిన ప్రతీ ఒక్కరిని కాపాడే దైవం ఆ మణికాంటుడన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీదర్మశాస్త్ర అయ్యప్ప స్వామి కమిటీ సభ్యులు ఉంగరాలు శ్రీనివాస్,ఎన్.హరి బాబు, దీపక్, గురు స్వామి ఇంద్ర కుమార్ దేవ్ గ్రామ పెద్దలు కోలన్ లీడర్ నర్సింహా రెడ్డి దంపతులు, సాయిలు యాదవ్, ఎన్ఎంసి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగారాయ ప్రసాద్, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, ముఖ్య నాయకులు సీనియర్ నాయకులు, నాయకులు డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకురాలు,యువ నాయకులు, భక్తులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

# సమాజ దర్శనికుడు రామోజీరావు

## కొండపల్లి లో ఘన నివాళి



**ఇబ్రహీంపట్నం,జూన్ 8 (వార్తా ప్రభ ప్రతినిధి):-** ఈనాడు గ్రూపు సంస్థల అధినేత చెరుకూరి రామోజీ రావు మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది అని, ఆయన మరణం చాలా బాధాకరమని. తెలుగు ప్రజలకే కాదు దేశానికి తీరని లోటు అని తెలిపారు జంపాల సీతారామ య్య.కొండపల్లి లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ తెలుగు మీడియా రంగంలో తనకంటూ ఒక అధ్యాయాన్ని లిఖించుకున్నరు రామోజీ రావు. ఈనాడు దినపత్రిక ద్వారా తన కలంతో ఒక సమాజాన్ని ప్రభావితం చేసిన ఆయన ఇక లేని లోటు ఎప్పటికీ పూడ్చలేనటువంటిది. తన లాంటి దార్శనీకులు నూటికో కోటికో ఒకరు ఉంటారు. తెలుగు మీడియా రంగంలో తనకంటూ ఒక అధ్యాయాన్ని లిఖించారు రామోజీ రావు. పత్రిక,టీవీ, సినిమా తదితర రంగాల్లో రామోజీరావు సాధించిన విజయాలు ఆయనకు మాత్రమే కాకుండా యావత్ తెలుగు జాతికి గర్వకారణం. అక్షరానికి సామాజిక బాధ్యత ఉందని నిరూపించారన్నారు. తెలుగు భాషను కాపాడేందుకు ఆయన చేసి కృషి ఎంతో గొప్పది. జర్నలిజం,సాహిత్య రంగాల్లో ఆయన చేసిన కృషి గొప్పదనీ,సమాజ సేవ చేసి ఎంతో మంది గుండెల్లో నిలిచిపోయారనీ,కుటుంబ సభ్యులకు, సన్నిహితులకు నా ప్రగాఢ సానుభూతి అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రామినేని రాజశేఖర్, కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నూబోయన చిట్టి బాబు, కొండపల్లిమున్సిపాల్ పార్టీ అధ్యక్షులు చుట్టుకుదురు శ్రీనివాసరావు,కౌన్సిలర్లు, నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సత్యప్రభకు అభినందనలు



**ప్రత్తిపాడు జూన్ 8 ( వార్త ప్రభ ప్రతినిధి ):** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు శాసన సభ్యురాలుగా ఘన విజయం సాధించిన వరుపుల సత్య ప్రభ రాజాకు శంఖవరం మండలం తెలుగు దేశం పార్టీ నాయకులు బద్ధి రామారావు ఆధ్వర్యంలో నెల్లిపూడి గ్రామ యువత పూలగుచ్చాలతో అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# గుడికి వెళ్లి వస్తానని ఇంటి నుండి వెళ్లిన మహిళ అదృశ్యం.



**జవహర్ నగర్,జూన్,08:(వార్తా ప్రభ)** గుడికి వెళ్లి వస్తానని ఇంటి నుండి వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జవహర్ నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగరాజు మరియు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం జెట్టి లక్ష్మి తన నలుగురు పిల్లలతో కలిసి పదేళ్లుగా దమ్మాయిగూడలో నివాసం ఉంటున్నారు. ఆమె పెద్ద కుమార్తె అనురాధ గత నాలుగు సంవత్సరాలుగా నుండి ఇంట్లోనే ఉంటూ కుట్టుపని నేర్చుకుంటుంది. అనురాధ శుక్రవారం ఉదయం గుడికి వెళ్లిందని, అప్పటి నుండి ఇంటికి తిరిగి రాలేదని, ఆమె కోసం తెలిసిన ప్రదేశాలలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శనివారం జవహర్ నగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మహారాష్ట్రకు చెందిన ఆకాష్ (21) అనే వ్యక్తి ప్రమేయం ఉన్నట్లు కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# పద్మ భూషణ్ రామోజీరావుకు అశ్రు నివాళులు




**కూకట్ పల్లి, జూన్ 8 (వార్తా ప్రభ):** ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ చెరుకూరి రామోజీరావు (88) గారికి ఆకాంక్ష ఫౌండేషన్ వ్యవస్థాపకులు సి హెచ్ వి రామారావు ఆధ్వర్యంలో కూకట్పల్లి వివేకానంద నగర్ ప్రాంతంలోని వివేకానంద విగ్రహం ముందు రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆకాంక్ష ఫౌండేషన్ చైర్మన్ రామారావు, సీనియర్ జర్నలిస్ట్ ఎర్ర యాకన్న, కూకట్పల్లి స్థానికులు నరసింహ, ప్రేమ్ కుమార్, సురేష్, మని, భూమయ్య, భాషా, రమేష్, విలేకరులు అనిల్ కుమార్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

# సమాజ దర్శనికుడు రామోజీరావు

## - శాసనసభ్యులు గాంధీ ఘన నివాళి



**శేరిలింగంపల్లి,జూన్ 8 (వార్తాప్రభ):** ఈనాడు గ్రూపు సంస్థల అధినేత చెరుకూరి రామోజీ రావు మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది అని, ఆయన మరణం చాలా బాధాకరమని. తెలుగు ప్రజలకే కాదు దేశానికి తీరని లోటు అని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూతెలుగు మీడియా రంగంలో తనకంటూ ఒక అధ్యాయాన్ని లిఖించుకున్నరు రామోజీ రావు. ఈనాడు దినపత్రిక ద్వారా తన కలంతో ఒక సమాజాన్ని ప్రభావితం చేసిన ఆయన ఇక లేని లోటు ఎప్పటికీ పూడ్చలేనటువంటిది. తన లాంటి దార్శనీకులు నూటికో కోటికో ఒకరు ఉంటారు. తెలుగు మీడియా రంగంలో తనకంటూ ఒక అధ్యాయాన్ని లిఖించారు రామోజీ రావు. ఆయన మన మధ్యన ఇక లేరు అన్న వార్త నన్ను ఎంతగానో బాధించింది. ఆ మహనీయుడి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ,వారి కుటుంబ సభ్యులకు,అభిమానులకి నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా అని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. సాధారణ వ్యక్తిగా ప్రారంభమైన ఆయన జీవితం అందరికీ ఆదర్శమని,నిరంతర శ్రమ,నిత్యం కొత్తదనం కోసం తపన,చెదరని ఆత్మస్థైర్యం,నిబద్ధత,క్రమశిక్షణ కలగలిసిన గొప్ప వ్యక్తి రామోజీ రావు అని, తెలుగు వాడి సత్తాను యావత్ ప్రపంచానికి చాటి చెప్పిన రామోజీరావు చిరస్మరణీయులు అన్నారు. పత్రిక,టీవీ, సినిమా తదితర రంగాల్లో రామోజీరావు సాధించిన విజయాలు ఆయనకు మాత్రమే కాకుండా యావత్ తెలుగు జాతికి గర్వకారణం. అక్షరానికి సామాజిక బాధ్యత ఉందని నిరూపించారన్నారు. సమాజ హితం కోసం మీడియా ద్వారా కృషి చేశారు ఏ రంగంలో అడుగుపెట్టినా.. తనదైన ముద్ర వేశారు. ప్రతి వ్యాపారంలో అగ్రగామిగా నిలిచారన్నారు..ఒక చిరుద్యోగిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన రామోజీ రావు.. వేల మందికి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదిగారు అని. ఎంతో మంది కుటుంబాల్లో వెలుగు నింపారన్నారు. అని తెలుగు భాషను కాపాడేందుకు ఆయన చేసి కృషి ఎంతో గొప్పది. జర్నలిజం,సాహిత్య రంగాల్లో ఆయన చేసిన కృషి గొప్పదనీ,సమాజ సేవ చేసి ఎంతో మంది గుండెల్లో నిలిచిపోయారనీ,కుటుంబ సభ్యులకు, సన్నిహితులకు నా ప్రగాఢ సానుభూతి అన్నారు. రామోజీ రావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడి నీ ప్రార్థిస్తున్నా అని ఎమ్మెల్యే గాంధీ నివాళులర్పించారు.

# రామోజీరావు మృతి తెలుగు ప్రజలకు తీరని లోటు

- కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు



**హనుమాన్ జంక్షన్, జూన్ 8 ( వార్త ప్రభ ప్రతినిధి ):** హైదరాబాద్ రామోజీ ఫిలిం సిటీ లోని కార్పొరేట్ కార్యాలయంలో చెరుకూరి రామోజీరావు పార్థివ దేహానికి పూలమాలవేసి చలసాని ఆంజనేయులు ఘనంగా నివాళులు అర్పించి ఆయన కోడలు మార్గదర్శి ఎం.డి చెరుకూరి శైలజ కిరణ్ కు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రామోజీరావుకు నివాళులు అర్పించిన వారిలో కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు తో ఆళ్ల వెంకట గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.

# ఎడిటోరియల్

## వైసీపీ కేడర్ ఆత్మహత్యలకు అసలు కారణం ఇదేనా?

ఏపీలో సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా దెబ్బతిన్న సంగతి తెలిసిందే. ఎవరూ ఊహించని రీతిలో అన్నట్లుగా గత ఎన్నికల్లో 151 సీట్లు సాధించిన ఆ పార్టీ.. 2024కి వచ్చేసరికి 11 సీట్లకు పరిమితమైన పరిస్థితి. దీంతో... ఇప్పుడు ఆ పార్టీ నేతలు పోస్ట్ మార్టం పనుల్లో ఉన్నారని అంటున్నారు. మరికొంతమంది మాత్రం ఓటమికి ప్రధానకారణం అంటూ సీఎంవోపై విరుచుకుపడుతున్నారు.ఇంకొంతమంది వాలంటీర్ వ్యవస్థపై ఫైర్ అవుతుంటే... మరికొంతమంది గత ప్రభుత్వ హయాంలో చేసిన తప్పులను లిస్ట్ అవుట్ చేస్తున్నారని సమాచారం. ఆ సంగతి అలా ఉంటే... ఏపీలో ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటినుంచి పలువురు వైసీపీ కార్యకర్తలు ఆత్మహత్యలు చేసుకుంటున్న సంగతి తెలిసిందే. అయితే వీటికి కారణం మనస్థాపం కాదు బెట్టింగులని అంటున్నారు.అవును... ఏపీలో వైసీపీ కచ్చితంగా గెలుస్తుందనే నమ్మకాన్ని కేడర్ కల్పించినప్పటికీ ఓటర్లలో కల్పించలేకపోయారని అంటున్నారు పరిశీలకులు. ఆ పార్టీ అధినేత ఎప్పుడూ గ్రౌండ్ లెవెల్లో ప్రజల నాడిని పట్టుకోవడంలో పూర్తిగా ఫెయిల్ అయ్యారని చెబుతున్నారు. అయితే... ఐప్యాక్, ఆరా మస్థాన్ వంటి పలు సంస్థలు మాత్రం... ఏపీలో వైసీపీ గెలుపుపై పూర్తి ధీమా వ్యక్తం చేశాయి.దీంతో... ఇంత బలంగా చెబుతున్నారనే సరికి వైసీపీ కేడర్ బెట్టింగులు భారీగా కాసాయని అంటున్నారు. ఈ సర్వే సంస్థలతో పాటు వైసీపీ అధినేత జగన్ కూడా తమ పార్టీ గెలుపుపై పూర్తి ధీమాను కనబరిచారు. పైగా... ఎక్కడకు వెళ్లినా వైనాట్ 175 అనేవారు. దీంతో... పై 75 రాకపోయినా కనీసం 100 అయినా వస్తాయి కదా అనే భ్రమల్లో కేడర్ ఉండేవారని అంటుంటారు.కట్ చేస్తే 11 స్థానాలకు పడిపోయిన పరిస్థితి. ప్రధాన ప్రతిపక్ష హోదా కూడా లేని పరిస్థితి. ఈ సమయంలో పలువురు వైసీపీ కార్యకర్తలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలుస్తుంది. అయితే... అందుకు కారణం పార్టీ ఓడిపోయిందనో, జగన్ ఘోరంగా దెబ్బతిన్నారనో చెందుతున్న మనస్థాపం కాదని.. కేవలం పైన చెప్పుకున్న అందరి మాటలూ నమ్మి భారీగా బెట్టింగులు కాసి, ఆర్థికంగా చితికిపోవడమే అసలు కారణం అనే మాటలు వినిపిస్తున్నాయి.

## అక్షరాల "జర్నీ"లిస్టు..!




ఆయన రాసేది తక్కువే..
రాయించేది ఎక్కువ..
అలా రాయించేటపుడు
జంకడు..
బెదరింపులు రానీ..
ఒత్తిడులు పెరగనీ..
దాడులే జరగనీ...
రాయిలా నిలబడి
రాయిస్తూనే ఉన్నాడు..
అలా అక్షరయాత్ర సాగించి..
అనుకున్నవి ఎన్నో సాధించి..
నిన్న గాక మొన్న కూడా
ఒక మహాక్రతువును ముగించి..
విజయగర్వంతో
అక్షరమాల ధరించి
దివికేగాడు..
మూత పడని ఆ పెన్ను..
అవినీతిపై ఈనాడు పేరిట
ఏనాడో ఎక్కుపెట్టిన గన్ను..!
అక్షరమే ఆయుధమై..
సమాజహితంలో
తానే ఒక సమిధయై..
ఎక్కడో పుట్టినా వార్త.
రామోజీరావు దాని కర్త..
ఆ వార్తకు సంస్కర్త..
కృతిభర్త..!
ఇలా ఉంటే అది వ్యాసమని..
అలా చదవడమే పాఠకుని వ్యాసంగమని..
నిర్వచించి..అదే ప్రవచించి..
అలాగే రాయించి..
పత్రికకి ప్రమాణం
నిర్దేశించిన
చారిత్రక ప్రయాణం..!
నీ ఆసక్తి..నా అనురక్తి..
రామోజీరావు యుక్తి..
తెలుగు భాషకు
ఈనాడు ప్రథమావిభక్తి..!
చదివేవాడికి రక్తి..
ఎందరికో భుక్తి..!
ఈనాడు మూలవిరాట్టు..
ఆధునిక మీడియా సామ్రాట్టు..
పట్టిందే పట్టు..
విడిచిపెడితే ఒట్టు..
పోరాటమే పథం..
అక్షరమే ఆయుధం..
ఈనాడే పాశుపతం..
అదే రామబాణం..
అదే సుదర్శనం..
ప్రతి ఉదయం
సంచలనంతో దర్శనం..
రామోజీ ధైర్యానికి
ఆ పత్రికే నిదర్శనం..!
ఈనాడు
ఒక వ్యసనం..
ఒక శాసనం...
పాఠకుడికి ఏకాసనం..
అధినేతకు సింహాసనం..!బి
సామాన్యంగా
మొదలైన
సినిమా ప్రయాణం..
ఉషాకిరణ్..
తిమిర సంహరణాలు..
అదీ ఒక చరిత్రే..
ఆయన సినిమాలూ
అవకరాలకు ప్రతిఘటనే..!
ఫిలిం సిటీ..
రామోజీ కీర్తి కిరీటంలో
మరో కలికితురాయి..
బాలీవుడ్ సైతం చూడని
మరో ప్రపంచం..
హాలీవుడ్ స్థాయి
సంచలనం..
ఇలాంటి ఎన్నో అపురూపాలతో
సదా అద్భుతాలతో
రామోజీరావు కరచాలనం!
సరే..మార్గదర్శి ని పక్కనబెడితే..
పత్రికా రంగానికి
ఆయనే మార్గదర్శి..
అక్షరానికి బలం..
వార్తకు శక్తి..
రాతకు ఉన్నతి..
పత్రికకు గౌరవం..
ప్రచురణకు సాంకేతికత..
పాఠకుడికి ఉత్సుకత..
ఇవన్నీ రామోజీరావు భావుకత..!..
పుట్టుకతో జర్నలిస్టు కాకపోయినా..
తుది శ్వాస వరకు
అక్షరంతోనే ప్రయాణం
సాగించిన జర్నలిస్టు..!
ఈనాడు అధిపతి
రామోజీరావుకు నివాళి అర్పిస్తూ..

**మీ దాసరి తాతారావు**

## తెలుగు పత్రికా రంగాన్ని మలుపు తిప్పిన అక్షరయోధుడు చెరుకూరి రామోజీరావు

- రామోజీరావు కుటుంభ సబ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తున్నా
- విజయవాడ ఎమ్ పి కేశినేని శివనాథ్



**ఢిల్లీ** రామోజీరావు కుటుంబ సభ్యులకి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని విజయవాడ ఎమ్ పి కేశినేని శివనాథ్ చిన్ని)శనివారం ఢిల్లీ నుంచి సందేశం పంపారు. తెలుగునాట ఈనాడు దినపత్రికను స్థాపించి.. పత్రికా లోకంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన చెరుకూరి రామోజీరావు మృతి వార్త దిగ్భ్రాంతికి గురి చేసిందని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. ఢిల్లీ లో శనివారం టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడుతో పాటు కలిసి రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. పత్రికా రంగానికి, ఎలక్ట్రానిక్ మాధ్యమాల విస్తరణకు వార్తలు ప్రజల వద్దకు సత్వరం చేరటానికి అసాధారణమైన కృషి చేసిన రామోజీరావు మరణం పత్రిక రంగానికి తీరని లోటని సంతాపం వ్యక్తం చేశారు. అలాగే ఆయన ఆత్మకి శాంతి చేకూరాలని ఆ భగవంతుడ్ని ప్రార్థించారు. అనంతరం కేశినేని శివనాథ్ రామోజీరావు పత్రికా రంగానికి చేసిన సేవలు గుర్తు చేసుకున్నారు.తెలుగు పత్రికా రంగాన్ని మలుపు తిప్పిన అక్షరయోధుడు చెరుకూరి రామోజీరావు అని కొనియాడారు. తెలుగుప్రజల్లో దినపత్రికల పట్ల ఆసక్తిని, అభిరుచులను పెంపొందించడంలో రామోజీరావు విశేషమైన కృషి చేశాడని తెలిపారు.. ఈనాడు డైలీ పేపర్ కి అనుబంధంగా అన్నదాత, విపుల, చతుర, సితార, తెలుగు వెలుగు లాంటి పత్రికలను స్థాపించి ప్రజల్లో,పాఠకుల్లో ఉత్తమ సాహితీ పఠనాశక్తిని కలిగించిన పత్రికా దార్శనికుడు. అలాగే మారిన కాలానికి అనుగుణంగా ఈటీవీ, ఈటీవీ న్యూస్ శాటిలైట్ చానెల్స్ ప్రారంభించి, ఆయన జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతి గడించాడని పేర్కొన్నారు. రామోజీరావు లేని లోటు పత్రికా రంగానికే కాదు, తెలుగు సాంస్కృతిక రంగానికి తీరని వెలితిగా భావిస్తూ.. రామోజీరావు కుటుంబ సభ్యులకు, ఈనాడు గ్రూప్ సభ్యులందరికీ సానుభూతిని కేశినేని శివనాథ్ తెలియపర్చారు

## ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత, అక్షర యోధుడు చెరుకూరి రామోజీరావు (87) మృతి పత్రికా రంగానికి తీరని లోటు



**విజయవాడ పశ్చిమ జూన్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఈనాడు గ్రూపుల సంస్థ అధినేత రామోజీరావు మరణానికి సంతాపం తెలియజేస్తూ వించిపేట,ఎమ్.ఎస్.బేగ్ కార్యాలయం నందు ఎమ్.ఎస్ బేగ్ ఆధ్వర్యంలో శనివారం ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్.ఎస్.బేగ్ మాట్లాడుతూ...రామోజీ గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు గారి మృతి తెలుగు అక్షర సమాజానికి తీరని లోటన్నారు .ప్రజా పక్షపాతి, అలుపెరుగని అక్షర యోధుడికి కన్నీటి నివాళులు అర్పిస్తున్నాను. ప్రజా సమస్యలే తన ఊపిరిగా ఐదు దశాబ్దాల పాటు ప్రజల కోసం నిబద్ధతతో పోరాడిన రామోజీరావు మనకు మార్గదర్శికమన్నారు.ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిన ప్రతిసారి ఆయన ఉద్యమస్ఫూర్తితో ప్రజల కోసం పనిచేశారు. తెలుగు జర్నలిజానికి విశ్వసనీయతను, తెలుగు మీడియా రంగానికి కొత్త పంథాలో తీసుకువెళ్లి తెలుగుతోపాటు అనేక భాషల్లో మీడియా రంగాన్ని విస్తరించారు. ఉషాకిరణ్ మూవీస్ ద్వారా వివిధ భాషల్లో 87 సినిమాలు నిర్మించారు.. ఉషాకిరణ్ మూవీస్ బ్యానర్ ద్వారా ఎంతోమంది నటులు పరిచయమై ఎంతోమంది నటులు, అగ్రశ్రేణి తారలుగా ఎదిగారు.రామోజీ ఫిలిం సిటీ ని స్థాపించి భారతీయ చలనచిత్ర రంగాన్ని నూతన శిఖరాలకు చేర్చారని ఎమ్ ఎస్ బేగ్ అన్నారు. రామోజీరావు మరణం తన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని..ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నాను అన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సుఖాసీ కిరణ్ బూర కనకారావు, సుకాసి సరిత, అబ్దుల్ సత్తార్, బేవర సాయి సుధాకర్,నమ్మి భానుప్రకాష్, మీర్జా ముజాఫర్ బేగ్,మక్కెన భాస్కర్, బడుగు వెంకన్న , బంక సురేష్, అలీ, లక్ష్మి మరియు టీమ్ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## అన్ని రంగాల్లో ఆరితేరిన యోధులు దివంగత రామోజీరావు

- తెలుగుదేశం పార్టీ విజయ దుందుభి కోసమే ఇన్నాళ్లూ వూపిరి బిగబట్టారు
- తెదేపా పశ్చిమ తెలుగు మహిళా అధ్యక్షురాలు సుకాసి సరితా కిరణ్ కుమార్



**విజయవాడ పశ్చిమ జూన్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**తెలుగు భాషకు వన్నె తెచ్చిన రామోజీరావు అన్ని రంగాల్లో ఆరితేరిన యోధులు అని తెదేపా పశ్చిమ నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు సుకాశి సరితా కిరణ్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే తెలుగుదేశం పార్టీ (ఎన్డీయే కూటమి) విజయ దుందుభి వినే వరకూ ఆయన వూపిరి బిగబట్టారని సుకాశి కిరణ్ కుమార్, సరిత దంపతులు పేర్కొన్నారు. దక్షిణ భారతదేశ ప్రజలందరూ సినీ ప్రపంచంలోని రాజకీయ రంగంలోని సేవా రంగంలోనూ. చిన్న చిన్న కుటుంబాలకు మార్గదర్శిని ఒక సంస్థను తీసుకువచ్చి వాళ్ళ అవసరా లు తీర్చుకునే విధంగా వాళ్లంతా జరుగుతున్న అభివృద్ధిని మారుతున్న ప్రపంచాన్ని ఈనాడు ఈటీవి అనే మాధ్యమాల ద్వారా ప్రజలందరికీ తెలియపరచి వాళ్ళను చైతన్యపరిచిన అభివృద్ధి వేదిక ఈనాడు గ్రూపుల ని వారు తమ ప్రకటనలో తెలిపారు. చదువులను కళా రంగంలోనూ గుర్తింపు తీసుకువచ్చి ఎన్నో జీవితాలకు మార్గదర్శిని చూపిన మార్గదర్శి రామోజీరావు చివరి దశలో కొంతకాలం క్రితం మార్గదర్శి మీద ఈనాడు ఈటీవీపై కక్ష సాధించుకునే విధంగా జగన్మోహన్ రెడ్డి తను ఆరోగ్యం బాగో లేకపోయినా ఏ తప్పు చేయకపోయినా అతనిని అరెస్టు చేయిద్దామని ఆంధ్ర సిఐడిని తను చెప్పు చేతుల్లో ఉన్నటువంటి కొంతమంది వృత్తికి ద్రోహం చేసే ఆ టువంటి ఆఫీసర్ల ద్వారా. అరెస్టు చేద్దామని ట్రై చేసి విఫలమయ్యారని గుర్తు చేశారు.ఆరోజుల్లో తీసుకున్నటువంటి నిర్ణయం కావచ్చు ఆంధ్రప్రదేశ్లో వైసీపీ ప్రభుత్వాన్ని తుడిచిపెట్టుకుపోయే విధంగా ప్రజల్ని చైతన్యపరచి వైసిపి చేసిన దుర్మార్గాలను బయటపెట్టి ప్రజల్ని గెలిపించి అందరూ కోరుకున్న తెలుగుదేశం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే విధంగా తాను కృషిచేసి చంద్రబాబునాయుడు నాలుగోసారి ముఖ్యమంత్రిగా చేద్దామని లక్ష్యం నెరవేరిందన్నారు. రామోజీరావు తను ఈరోజు అస్తమించిన సూర్యుడు మళ్ళీ వస్తాడు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా వుంటారంటూ రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ఆయన కుటుంబ సబ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## రామోజీరావుకు ఘన నివాళులు!!!



**మచిలీపట్నం జూన్ 8 ( వార్త ప్రభ ప్రతినిధి ):**ఈనాడు దినపత్రిక రామోజీరావు మరణం పట్ల మచిలీపట్నం సాహితిమితులు సంస్థ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ శనివారం తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు .భారత దేశంలో జర్నలిజానికి కొత్త రూపును తీసుకొచ్చి జిల్లా ఎడిషన్ లను ఆంధ్రప్రదేశ్లో ప్రారంభించి జర్నలిజంలో తనకంటూ ఒక పేజీని ఏర్పాటు చేసుకున్న రామోజీ మరణం తీరని లోటన్ని బాలాజీ అన్నారు.ఇటు పత్రిక రంగంతో పాటు సినిరంగంలో అనేకమంది యువనటూలు ని ప్రోత్సహించి ఈనాడు ఎడిషనులుఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసి కొన్ని వేలమందికి జీవనాధారం కల్పించిన రామోజీరావు సేవలు మరువలేనివిఅని బాలాజీ అన్నారు.హైదరాబాదులో రామోజీ ఫిలిం సిటీ నిర్మించి సినీ రంగానికి అగ్ర పీఠం వేసిన రామోజీరావు సేవలు సినీ రంగంలో కూడా చిరస్థాయిగా ఉంటాయని బాలాజీ అన్నారు అదేవిధంగా మచిలీపట్నం కొంతమంది ప్రముఖులు రామోజీకి ఘన నివాళులర్పించారు

## అయ్యప్ప స్వామి దేవాలయంలో మండల పూజ

**హిందూపురం జూన్ 8 ( వార్త ప్రభ ప్రతినిధి ):**శ్రీసత్యసాయి జిల్లా, హిందూపురం పట్టణంలోని శ్రీకంఠపురంలో అయ్యప్పస్వామి దేవాలయంలో శనివారం మండల పూజా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గణపతి నవగ్రహ సుబ్రమణ్య తదితర పరివార దేవతల హోమములు అంగరంగ వైభవముగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అనిల్ కుమార్ బిజెపి రాష్ట్ర నాయకులు పి డి పార్థసారథి, వరప్రసాద్, వేణుగోపాల్ తిరుమలేశ, బద్రి, మునిశాంతరాజు అయ్యప్ప మహిళలు పాల్గొన్నారు.

## దివంగత రామోజీరావు కి ఆంధ్ర సారస్వత పరిషత్ తరుపున ఘన నివాళి.

- రామోజీరావు మృతి పత్రికా రంగానికి తీరని లోటు
- డాక్టర్ గజల్ శ్రీనివాస్



**విజయవాడ పశ్చిమ జూన్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**అచ్చమైన తెలుగు భాషలో అక్షరాలు రూపుదిద్ది "ఈనాడు" పత్రికా రంగంలో "ఏనాడు" తనకు ఎదురులేదని నిరూపించిన అక్షర యోధుడు రామోజీరావు మృతి పత్రికా రంగానికి తీరని లోటని ఆంధ్ర సారస్వత పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గజల్ శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.తెలుగు జాతి స్ఫూర్తి, తెలుగు వెలుగు అయిన ఈనాడు సంస్థల అధినేత రామోజీ రావు మరణం తెలుగు జాతికి తీరని లోటు. తెలుగు సాహితీ, సాంస్కృతిక వైభవానికి, ఆధ్యాత్మిక రంగానికి తన పత్రిక ద్వారా నిరంతరమూ తపస్సు చేసిన గొప్ప యోగి ఆయన. తెలుగు జాతి సమస్తం వారికి సదా ఋణ పడి ఉంటుందని గజల్ శ్రీనివాస్ పేర్కొన్నారు.వారి ఆత్మకు సద్గతి కలగాలని ఈశ్వరుణ్ణి ప్రార్థిస్తున్నాము. వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ఆంధ్ర సారస్వత పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గజల్ శ్రీనివాస్ తన ప్రకటనలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో పవన్ కళ్యాణ్ వీరాభిమాని మృతి

**అంతిమ సంస్కారానికి ఆర్థిక చేయూత నిచ్చిన జనసేన పార్టీని నాయకులు తిరుపతి సురేష్, అనూష దంపతులు**



**విజయవాడ పశ్చిమ జూన్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని భవానిపురం హౌసింగ్ బోర్డ్ ప్రాంతానికి చెందిన పవన్ కళ్యాణ్ వీరాభిమాని ముడి గోడుపుల పవన్ కుమార్ (22) యువకుడు శనివారం ఉదయం మృతిచెందారు. సుమారు నెలరోజుల క్రితం తెలంగాణ రాష్ట్రం లో రోడ్డు ప్రమాదానికి గురై గుంటూరులోని ఎయిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ ఈ రోజు మృతి చెందారు. ఇంటీరియర్ వర్క్స్ చేస్తూ జీవనం సాగిస్తున్న పవన్ కుమార్ కి గతేడాదే వివాహం అయ్యింది. నెల రోజులు పాటుగా మృత్యువుతో పోరాడిన ఆ యువడు కడు నిరుపేదని సమాచారం అందుకున్న 42 వ,డివిజన్ జనసేన పార్టీ నాయకులు తిరుపతి సురేష్ తిరుపతి అనూష దంపతులు తమ వంతుగా వారి కుటుంబాన్ని పరామర్శించి మట్టి ఖర్చుల నిమిత్తం 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం మృతుని కుటుంభ సబ్యులకు అందజేశారు.

## ఈనాడు సంస్థల చైర్మన్ చెరుకూరి రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పించిన మండల తెదేపా



**రెడ్డిగూడెం జూన్ 8 , ( వార్త ప్రభ ప్రతినిధి )::**రెడ్డిగూడెం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఈనాడు సంస్థల చైర్మన్ చెరుకూరి రామోజీరావు చిత్రపటానికి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా రామోజీరావు సేవలను టిడిపి నాయకులు కొనియాడారు.ఆయన ను ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సంస్థల ద్వారా లక్షలాది మందికి ఉపాధి కల్పించారని , గౌరవాన్ని తీసుకొచ్చారని, లైఫ్ చేంజర్ అని నాగేశ్వరరెడ్డి అన్నారు.

## ఇద్దరు కూలీలకు విద్యుత్ షాక్!!!



**మచిలీపట్నం జూన్ 8 ,( వార్త ప్రభ ప్రతినిధి ):**మచిలీపట్నం శనివారం రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితుల్లో రోజువారి కూలి పనులు చేసుకుంటూ జీవ సాగించే ఇద్దరు యువకులకు కరెంట్ షాక్ తగిలింది. స్థానిక పదో డివిజన్ సుకర్లబాదు హిందుస్థాన్ ఫైనాన్స్ లిమిటెడ్ కార్యాలయంలో సీలింగ్ పనుల చెయ్యటానికి కూలీలు వచ్చారు. మూడో అంతస్తు లో పనులు చేయవలసి ఉండగా కింది నుంచి సీలింగ్ పనుల సామాను పైకి తీసుకెళ్తున్న సమయంలో పక్కనే ఉన్న 32 కేబిహెచ్ హైటెన్షన్ వైర్లుకు తగిలి ఇద్దరు కూలీలు విద్యుత్ షాక్ గురయ్యారు. తీవ్రంగా గాయపడ్డారు స్థానికులు వెంటనే 108 వాహనానికి ఫోన్ చేసి హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

# విచ్చలవిడిగా రేషన్ మాఫియా

**ఇబ్రహీంపట్నం జూన్ 08(వార్తా ప్రభ ప్రతినిధి):**–మండల పరిధిలోని కొటికలపూడి గ్రామంలో అడ్డగోలుగా పట్టపగలు రేషన్ మాఫియా రెచ్చిపోతోంది. ఇంటింటికీ తిరిగి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి స్థానిక గ్రామాలలో ఉన్న కోళ్లఫారాలకు తరలిస్తూ అక్రమ సంపాదనకు అలవాటు పడిన కొందరు కేటుగాళు విచ్చలవిడిగా రెచ్చిపోతున్నారు. అడ్డదారులలో సంపాదనకు అలవాటు పడి ప్రభుత్వ వ్యవస్థలను సైతం బురిడీ కొట్టించి పగలు రాత్రి తేడా లేకుండా రేషన్ బియ్యాన్ని అడ్డదారుల్లో దళారులకు అందిస్తున్నారు. పట్టపగలే రేషన్ మాఫియా ఇంతలా రెచ్చిపోతున్నా కూడా ఆ గ్రామ రెవిన్యూ అధికారికి మాత్రం తెలియనట్లుగా వ్యవహరించడం వెనుక ఉన్న అసలు రహస్యం ఏమిటో అంటూ కొందరు గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అసలు విషయం ఏమిటంటే ఆ గ్రామ పరిధిలోని రెవెన్యూ అధికారి గత కొంతకాలంగా ఉన్నా లేనట్లే వ్యవహరించడంతో కొటికలపూడి గ్రామంలో అక్రమ రేషన్ దందా కూడా అధిక మొత్తంలో జరుగుతోందని, ఒక వేళ ఎవరైనా ఈ గ్రామంలో జరిగే అక్రమ దందాలపై సమాచారం ఇచ్చినా కూడా సంభందితశాఖలు నుండి స్పందన కూడా ఉండదని విశ్వసనీయ సమాచారం. కొటికలపూడి గ్రామంలో జరుగుతున్న దందాలపై ఎవరైనా ప్రశ్నిస్తే ఎంతోకొంత ముట్ట చెబుతాం ఇక్కడనుండి తక్షణమే వెళ్ళిపోవాలి అంటూ హుకుం జారీ చేయడం ఈ గ్రామ పరిధిలో అక్రమాలకు పాల్పడుతున్నటువంటి వారి ప్రత్యేకత.

## దొరికితే ముడుపుల మాయాజాలం

కొటికలపూడి గ్రామంలో జరుగుతున్న రేషన్ మాఫియా పై సమాచారం అందుకున్న అధికారులు కానీ ఆ ప్రాంతానికి వెళితే వెంటనే ఎంతో కొంత ముట్టజెప్పి అక్కడ నుండి వంపించేయడం వీరికి వెన్నతో పెట్టిన విద్య. ఇప్పటికైనా రెవెన్యూ వ్యవస్థ మొద్దు నిద్ర వీడి కొటికలపూడి గ్రామంలో జరుగుతున్న అక్రమ రేషన్ మాఫియా పై ఉక్కు పాదం మోపి సంబంధిత అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.



# శ్రీ కనకదుర్గమ్మ నిత్యాన్నదాన ట్రస్ట్ కి రూ 1 లక్షా 10 లు విరాళం అందజేత



**విజయవాడ పశ్చిమ జూన్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రిపై ఆలయము నందు ప్రతిరోజూ జరుగు నిత్య అన్నదానము పథకంనకు మెయిన్ రోడ్, జి. కొండూరు కు చెందిన శనగవరపు ఆంజనేయ శాస్త్రి దంపతులు రూ. 1,00,010/–లను దేవస్థానం నందు జరుగు అన్నదానం నిమిత్తం విరాళముగా ఆలయ అధికారులను కలిసి దేవస్థానంనకు అందజేశారు. దాత కుటుంబంనకు ఆలయ అధికారులు అమ్మవారి దర్శనము కల్పించగా, వేదపండితులు వేదాశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదములు, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

# శ్రీ కనకదుర్గమ్మ బంగారు పధకంకు రూ 1 లక్షా 20 వేలు విరాళము అందజేత



**విజయవాడ పశ్చిమ జూన్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి పై బంగారు పధకంకి అనంతపురంకు చెందిన జ్వాలా పురం శ్రీకాంత్ మరియు కుటుంబసభ్యులు రూ. 1,20,000/–లను శ్రీ అమ్మవారి ఆలయం స్వర్ణ తాపడం పనుల నిమిత్తం ఆలయ కార్యనిర్వాహనాధికారి కె ఎస్ రామరావు ని కలిసి అందజేశారు. ఆలయ అధికారులు వీరికి కనక దుర్గమ్మ అమ్మవారి దర్శనం కల్పించి, వేదపండితులచే వేదాశీర్వచనం కల్పించగా, ఈవో శ్రీ అమ్మవారి ప్రసాదములు, శేష వస్త్రం మరియు చిత్రపటం అందజేశారు.

# బెజవాడ కనకదుర్గమ్మ ఆలయం బంగారు తాపడానికి విరాళాలు వెల్లువ

**విజయవాడ పశ్చిమ జూన్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రిపై ఈ ఏడాది ఏప్రిల్ 26 నుండి నేటి వరకూ విరాళాలు వెల్లువెత్తాయని ఆలయ అధికారులు తెలిపారు. కొండపైన నూతనముగా డోనార్ సెల్ భవనము నిర్మించినప్పటి నుండి ఈరోజు వరకు పలువురు దాతలు శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయ స్వర్ణ తాపడం పనులకు గాను రూ. 30,27,434/– లు అందజేయడం జరిగిందని ఈవో కె ఎస్ రామరావు తెలిపారు. శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయము గోపురం(ప్రస్తుతం బంగారం) తో పాటుగా మిగిలిన ఆలయమును పూర్తిగా కనకం(బంగారం)తో స్వర్ణతాపడం చేయుటకు గాను దాతలు దేవస్థానం నకు విరాళములు అందజేసి అమ్మవారి కృపకు పాత్రులు కావలిసినదిగా ఆలయ ఈవో కె. ఎస్ రామరావు భక్తులకు పిలుపునిచ్చారు.

# రామోజీ రావు జీవితం అందరికీ ప్రేరణ - ఎం.సుధాకర్ రెడ్డి



**పొదలకూరు జూన్ 08 (వార్తాప్రభ)** రామోజీ రావు జీవితం అందరికీ ప్రేరణ అని విజ్ఞాన్ జూనియర్ , డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఎం.సుధాకర్ రెడ్డి,ప్రిన్సిపాల్ ఏ.సుబ్బారావు జీ.ఎన్ రెడ్డి అన్నారు. శనివారం కళాశాల లో రామోజీ రావు చిత్రపటానికి పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామోజీరావు స్వయంకృషితో కష్టపడి అనేక రంగాల్లో విజయం సాధించారని కొనియాడారు. ఒక ధ్రువతారలా నిరంతరం వెలుగుతూ ఉంటారు. ఆయన చేపట్టిన కార్యక్రమాలు భవిష్యత్తు తరాలకు ఆదర్శమని రామోజీరావు ఒక పోరాట యోధుడు" అని అన్నారు. శ్రమ పడితే ఎంత ఎత్తుకైనా ఎదగవచ్చు అనడానికి రామోజీరావు జీవితమే నిదర్శనమన్నారు. ఆయన అందరికీ ఆదర్శప్రాయుడని పత్రికా రంగంలో వినూత్న ఒరవడిని తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమం లో కాలేజీ అకడమిక్ డీన్ సీ.హెచ్. కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ ఏ.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రామోజీరావు కు ఘన నివాళులు



**హనుమాన్ జంక్షన్,జూన్8 (వార్తాప్రభ)** బాపులపాడు మండలం బాపులపాడు గ్రామంలో శ్రవంతి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో శ్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచనేని సత్యప్రసాద్ ఆధ్వర్యంలో రామోజీరావు కి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రవంతి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మొవ్వ రామారావు, యనమదల సుధాకర్,వడ్డిల లక్ష్మీ ,వరిగంజి కిషోర్ , గొట్టపు వాసు,నీలం శ్రీధర్, వీరమాచనేని బుజ్జి,మేడేపూడి రామ్మోహనరావు, అభిరామ్,బోను ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# నారా లోకేష్ తో భేటీ అయిన కాకొల్లు నాగేశ్వరరావు



**కనిగిరి జూన్ 8 వార్తా ప్రభ ప్రతినిధి** తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ బాబును విజయవాడలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ప్రముఖ వ్యాపారవేత్త మధువన్ గ్రూప్ హొటల్ అధినేత కాకొల్లు నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం, దుశ్శాలవతో ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ చరిత్రలో ఇప్పటివరకు ఏ ఎమ్మెల్యే మంగళగిరిలో 90 వేల పైచిలుకు ఓట్లతో మెజారిటీ ఎవరికి రాలేదని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ బాబుకు మాత్రమే భారీ మెజారిటీ వచ్చిందని ఆ మెజారిటీపై హర్షం వ్యక్తం చేశారు. యువ గళం పాదయాత్రతో ప్రజల్లో మార్పును తెచ్చి, వైసీపీ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి తెలుగుదేశం పార్టీ 164 స్థానాల్లో కూటమి అభ్యర్థులు గెలవడానికి నారా లోకేష్ బాబు ప్రధాన పాత్ర పోషించారని, కాబోయే ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబు నాయుడు సారాధ్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని, ఉదయగిరి నియోజకవర్గాన్ని శాసనసభ్యులు కాకర్ల సురేష్ సారధ్యంలో అభివృద్ధి పథంలో నడిపిస్తారని గుర్తు చేశారు.

# రామోజీ చిత్రపటానికి ఘన నివాళులు



**నందవరం జూన్ 8 ( వార్త ప్రభ ప్రతినిధి ):**ఈనాడు గ్రూపు సంస్థల అధినేత, పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత రామోజీరావు మరణం బాధాకరమని టీడీపీ మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ పుష్పవతి అన్నారు. శనివారం స్థానిక నందవరం ఆమె స్వగృహంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆయన సాధారణ కుటుంబంలో పుట్టి ఓ వ్యవస్థగా మారారన్నారు. ఈనాడుతో ప్రజలను చైతన్యవంతులను చేశారన్నారు. ఆయన మరణం పత్రికా రంగానికి, నైతిక విలువలకు తీరని లోటు అన్నారు. తెలుగు భాష, జర్నలిజానికి ఎంతో కృషి చేశారన్నారు. ఈనాడు గ్రూప్ సంస్థల ద్వారా అక్షర యోధుడుగా పేరున్న రామోజీరావు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశానికి ఎనలేని సేవలు చేశారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# వాల్మీకి ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాలు



**నందవరం జూన్ 8 : (వార్తా ప్రభ ప్రతినిధి)** కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గంలో నందవరం మండల పరిధిలోని నందవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నందవరం కస్తూరిబా గాంధీ బాలికల ఉన్నత పాఠశాల, నాగలదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ముగతి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, ముగతి మోడల్ హై స్కూల్, కనకవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇబ్రహీంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2023 – 24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి వాల్మీకి కమ్యూనిటీకి చెందిన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు శ్రీ వాల్మీకి మహర్షి ప్రతిభ పురస్కారం అందించడం జరిగింది. నందవరం మండల వాల్మీకి ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు ప్రోత్సాహంతో ఉపాధ్యాయులు టి. ఉసేని, బి. వెంకటేశ్వర్లు, బి. తిమ్మారెడ్డి, బి. నాగరాజు, పి. నారాయణ, బి. వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సరస్వతి విద్యాపీఠం కరస్పాండెంట్ లింగమూర్తి, గ్రామ పెద్దలు ఓ మల్లేష్, వార్డ్ మెంబర్ రామాంజనేయులు నందవరం గ్రామ వాల్మీకి నాయకులు, యువకులు, విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రామోజీరావు మృతి కి ఘనంగా నివాళులు అర్పించిన టిడిపి నాయకులు



**హనుమాన్ జంక్షన్,జూన్8(వార్తాప్రభ)**రాష్ట్ర టీడీపీ కార్యాలయం ఆదేశాల మేరకు గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు సూచనల మేరకు గన్నవరం నియోజకవర్గం బాపులపాడు మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఈరోజు సాయంత్రం రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి ఐదు నిమిషాలపాటు మౌనం పాటించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బాపులపాడు మండల టిడిపి అధ్యక్షులు దయాల రాజేశ్వరరావు మాట్లాడుతూ రామోజీరావు ఓ వ్యక్తి కాదని ఆయన ఓ గొప్ప వ్యవస్థ అని, ఈనాడు ద్వారా ప్రజల్ని చైతన్యవంతుల్ని, విజ్ఞానవంతుల్ని చేశారని, పత్రికా రంగంలో రామోజీ చేసిన విశేష కృషి ప్రతి ఒక్క జర్నలిస్టుకు ఆదర్శనీయమని, ప్రతి అక్షరానికి సామాజిక బాధ్యత ఉంటుందని చూపించిన వ్యక్తి రామోజీరావు అని అన్నారు. ఈ కార్యక్రమంలో మూల్పూరి సాయికళ్యాణి, గుండపనేని ఉమా వరప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు, అట్లూరి శ్రీనివసరావు, కలపాల సూర్యనారాయణ, మొవ్వ వేణుగోపాల్, మండాది రవీంద్ర, చలసాని శ్రీనివాసరావు, సూరపురెడ్డిప బెనర్జీ, ఆలూరి రాంబాబు, తాడంకి స్వామిదాసు, సాయిల నాగేశ్వరరావు, చెన్నుబోయిన నాగరాజు, కొసరాజు గంగాధర్, త్రిపురనేని సత్యనారాయణ, కామినేని శ్రీహరిరావు, వీరపనేని నాగేశ్వరరావు, పడకల చంద్రశేఖరరావు, దొప్పలపూడి శ్రీనివాస్, దొప్పలపూడి వెంకటేశ్వరరావు, చెన్నుబోయిన వీరయ్య, ముప్పాల శంకర్రావు, జోగు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# ఎడిటర్ వృత్తికి వన్నెతెచ్చిన మహనీయుడు

■ పత్రికల విలువలు పెంచిన గొప్ప కలం యోధుడు రామోజీరావు ■ ఆంధ్రప్రదేశ్ పత్రికా సంపాదకుల సంఘం



**విజయవాడ, జూన్ 8 ( వార్త ప్రభ ప్రతినిధి ):**ప్రముఖ తెలుగు పత్రిక ఈనాడు అధిపతి చెరుకూరి రామోజీరావు అకాల మరణం పత్రికా రంగానికి తీరని లోటు అని, ఎడిటర్ వృత్తికి ఆయన తెచ్చిన విలువలు ఎనలేనివని, నేటి పత్రికా సంపాదకులంతా ఆయన బాటలో నడవాలని ఆంధ్రప్రదేశ్ పత్రిక సంపాదకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, కోస్తా ప్రభ ఎడిటర్ కే ప్రసాద్ బాబు అన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకోరాలని మనసారా భగవంతుని ప్రార్థిస్తున్నట్లు ఈనాడు పత్రిక ద్వారా చెరుకూరి రామోజీరావు తెచ్చిన సంస్కరణలు , అనేక మార్పులు, ఉన్నత విలువల తో పాత్రికేయ రంగానికి పెంపొందించడం జనం గుండెల్లో ఎప్పుడు జీవించే ఉంటారన్నారు. ఆయన మృతికిసంతాపం ప్రకటిస్తూ రామోజీరావు కుటుంబానికి పత్రికా సంపాదకుల సంఘం ఆధ్వర్యంలో ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ,మనోధైర్యాన్ని ఆ భగవంతుడు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ పత్రికా సంపాదకుల సంఘం ఒక ప్రకటనలో నివాళులర్పించారు.

# రామోజీరావుకు అబ్దుల్ కలాం సేవా సమితి ఆధ్వర్యంలో ఘన నివాళి



**విజయవాడ పశ్చిమ జూన్ 8 : (వార్తా ప్రభ ప్రతినిధి)**ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు మృతి దేశానికి తీరని లోటని పలువురు వక్తలు నివాళులర్పించారు. శనివారం సాయంత్రం అబ్దుల్ కలాం సేవా సమితి అధ్యక్షులు వేముల వెంకట్రావు ఆధ్వర్యంలో ఈనాడు అధినేత రామోజీరావుకి ఘన నివాళులర్పించిన కార్యక్రమం వాగు సెంటర్లోని వారి ఆఫీసులో జరిగింది. ఈ కార్యక్రమంలో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ చైర్మన్ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ రామోజీరావు బిజినెస్ పరంగా ఎంతో మందిని తీర్చిదిద్దారని కొనియాడారు. ఒక మంచి రంగంలో ఒక క్రమశిక్షణ గల ఈనాడు సంస్థ, ఈటీవీ , ప్రియా పికిల్స్ ,సినిమా రంగంలో నిర్మాతగా, ప్రపంచంలోనే అత్యున్నతమైన రామోజీ ఫిలిం సిటీని ఏర్పాటు చేసిన మహనీయుడని అన్నారు. ఎంతోమంది కళాకారులను తయారుచేసిన గొప్ప మనసున్నటువంటి వ్యక్తి రామోజీరావు పరమపదించడం చాలా బాధాకరమని తెలియజేశారు .ఈ కార్యక్రమంలో విజయవాడ నగర ప్రముఖులు ఎన్వి రావు, సూర్యారావు , బలివాడ శివకుమార్ పట్నాయక్, భోగవల్లి శ్రీధర్, బాయన శేఖర్ బాబు , నమ్మి అప్పారావు, రాజగిరి సోమేశ్వరావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొని రామోజీరావుకు ఘనంగా నివాళులర్పించారు.



రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కింజారపు అచ్చం నాయుడు కి విజయోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్న విజయవాడ నగర మాజీ కార్పొరేటర్ కాకు మల్లికార్జున యాదవ్ **–వార్త ప్రభ, అమరావతి**

# అక్షర యోధుడు అస్తమయం

## రామోజీరావు మరణం పాత్రికేయ వ్యవస్థకు తీరని లోటు

### ఏ.పీ.ఎం.పీ.ఎ జిల్లా అధ్యక్షులు మన్నేపల్లి సురేష్



**నెల్లూరు జూన్ 08 (వార్తాప్రభ)** ఈనాడు సంస్థల అధినేత పద్మ విభూషణ్ రామోజీరావు మరణం అత్యంత బాధాకరమని ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ నెల్లూరు జిల్లా అధ్యక్షులు మన్నేపల్లి సురేష్ తెలిపారు. ఆయన మరణం పత్రిక రంగానికి తీరని లోటు అన్నారు. పార్టీ జీవితంలో ఆయన ఓ తిరుగులేని వ్యైలంరాంంగా ఎదిగారన్నారు. పాత్రికేయ వృత్తిలో అలుపెరుగని పోరాటం చేసి ఎన్నో సేవలు ప్రజలకు చేసి ప్రజలలో గుర్తింపును పొందిన ఆయన మరణం పాత్రికేయులను కలిసిందని తెలిపారు. తెలుగు జాతికి ఒక వెలుగు దిగిన నిరంకుశ పాలకులపై తన ఈనాడు పత్రిక ఈటీవీ ద్వారా ప్రజలను చైతన్య పరిచారని కొనియడారు. ఆయన ఆత్మ జనం ఎక్కడున్నారు శాంతించాలని పాత్రికేయులు తరపున మరియు ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ నెల్లూరు జిల్లా కుటుంబ సభ్యులు తరపున తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్టు పేర్కొన్నారు.

## వీరవల్లి గ్రామంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమం



**హనుమాన్ జంక్షన్ జూన్8(వార్తాప్రభ)**కృష్ణాజిల్లా బాపులపాడు మండలం వీరవల్లి శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు.. మే నెల15వ తారీకు నుంచి జూన్ 7 తారీఖు వరకు నిర్వహించిన ఈ శిబిరంలో విద్యార్థిని విద్యార్థులకు విజ్ఞానంతో పాటు మానసిక శారీరిక ఉత్సాహన్ని నింపే ఆటల పోటీలు నృత్య ప్రదర్శన శిక్షణ ఇచ్చారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న సుమారు 60 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వేసవి శెలవులను దుర్వినియోగం చేయకుండా విజ్ఞానాన్ని పెంచే ఇలాంటి వేసవి శిక్షణ శిబిరాల ద్వారా విద్యార్థులకు విద్యతో పాటు క్రీడా సంస్కృతి అంశాల్లో నైపుణ్యతను సాధిస్తారని గ్రామ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కోడే బోయినబాబి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కోడే బోయినబాబి, గ్రామ సెక్రటరి జి శ్యామలరావు, విశ్రాంత ఉద్యోగి నందమూరి బాబురావు, గ్రంథాలయ అధికారి స్వర్ణలత, సచివాలయ సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ శివ నాగరాజు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు..

## మీడియా రంగంలో రామోజీరావు చిరస్మరణీయులు

**హనుమాన్ జంక్షన్,జూన్8(వార్తాప్రభ)**మీడియారంగంలో చెరుకూరి



రామోజీరావు చేసిన సేవలు చిరస్మరణీయులని ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షులు అట్లూరి రాజశేఖర్ కొనియాడారు. రామోజీరావు ఆకస్మికమృతికి సంతాపం తెలుపుతూ హనుమాన్ జంక్షన్ నాలుగురోడ్ల కూడలిలో శనివారం సాయంత్రం ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులు రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ తెలుగు పత్రికారంగంలో నూతన ఒరవడి సృష్టించారన్నారు. తెలుగుభాష అభివృద్ధికి యెనలేని కృషి చేసారని ప్రశంసించారు. అంతర్జాతీయస్థాయిలో రామోజీఫిలింసిటీ నిర్మించి తెలుగువారి సత్తాను ప్రపంచానికి చాటారన్నారు. రామోజీరావు మరణం పత్రికారంగానికి తీరనిలోటన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు అక్కినేని శ్రీనివాస ఫణింద్ర, చలమలశెట్టి శ్రీనివాసరావు, పల్లపు అంకమ్మబాబు, ఇంటి దేవసహాయం, మలిశెట్టి సుబ్రహ్మణ్యం, కాలి కిరణ్, దారావత్ హరికృష్ణ, షేక్ కరీం, మాతంగి కిషోర్, రెడ్డి రఘుబాబు, ఆకుల లక్ష్మి శ్రీనివాస్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ జంక్షన్ లో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



**హనుమాన్ జంక్షన్, జూన్ 8(వార్తాప్రభ)**మానవత స్వచ్ఛంద సేవా సంస్థను స్థాపించిన 13 సంవత్సరాల్లో అద్వితీయమైన అభివృద్ధిని సాధించిందని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత , మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. శనివారం హనుమాన్ జంక్షన్ మానవత స్వచ్ఛంద సేవా సంస్థ 2024- 2025 సంవత్సరానికి నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభకు మారుబోయిన అధ్యక్షత వహించారు. అధ్యక్షులుగా గూడపాటి జయరామ చంద్రరావు, కార్యదర్శిగా పాబోలు గణేష్ బాబు, కోశాధికారిగా ఘంటా ఇందిరా దేవి ఇతర కార్యవర్గ సభ్యులచేత ప్రమాణ స్వీకారం చేఇంచారు. ఈ కార్యక్రమంలో ప్రసిడెంట్ గా బాధ్యతలు నిర్వహించిన కూరెళ్ళ సుబ్బాచారి ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలపాటి నాగేశ్వరరావు , పొట్లూరి వీర శేషగిరిరావు, నారగాని కొండలరావు, కళ్ళేపల్లి నారాయణరావు, వేగిరెడ్డి సూర్యనారాయణ, వడ్డి రాజేశ్వరరావు , తాడి రంగారావు తదితరులు పాల్గొన్నారు.



## అక్షర యోధుడు రామోజీ మరణం బాధాకరం

### తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 8 ( వార్త ప్రభ ప్రతినిధి ):**ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత, తెలుగు దిన పత్రికల విస్తరణకు, నూతనత్వానికి ఆద్యులు రామోజీ రావు మరణం పట్ల తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. పత్రికా రంగంలో తెలుగు జర్నలిజానికి అఖిలభారత స్థాయిలో గుర్తింపు తెచ్చిన గొప్ప వ్యక్తి రామోజీ రావు అని, ప్రస్తుతం అమెరికాలో ఉన్న శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తెలుగు భాష సమున్నతికి, తెలుగు జర్నలిజం ద్వారా కృషి చేసిన కృషీ వలుడిని కోల్పోవడం బాధాకరమనని ఆయన నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## మీడియా రంగంలో తిరుగులేని చరిత్ర సృష్టించిన రామోజీరావు

### -ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ సంతాపం

**అమరావతి, జూన్ 8 ( వార్త ప్రభ ప్రతినిధి ) :** ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు అస్తమయం పట్ల ఆంధ్ర ప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, అభి మీడియా సొల్యూషన్స్ అధినేత ఇస్కా రాజేష్ బాబు, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ శాఖమూరి మల్లికార్జునరావు, రాష్ట్ర కోశాధికారి మత్తి శ్రీకాంత్ తదితర నేతలు సంతాపం వ్యక్తం చేశారు. పత్రికారంగంలో తిరుగులేని విధంగా చరిత్ర సృష్టించిన చెరుకూరి రామోజీ రావు ఎంతోమందికి ఉపాధి అవకాశాలను కల్పించారని కొనియాడారు. సామాన్యుడిగా కెరీర్ ప్రారంభించి అత్యున్నత స్థాయికి ఎదిగారని, జీవితాంతం నిబద్ధత, క్రమశిక్షణతో ఉన్నారన్నారు. చేపట్టిన ఏ పని అయినా సరే నైతిక విలువలు పాటించి మిగతవారికి ఆదర్శంగా నిలిచారన్నారు పత్రిక, టీవీ, సినిమా రంగాల్లో రామోజీరావు సాధించిన విజయాలు తెలుగు జాతికి గర్వంగా నిలుస్తాయని, తెలుగు వాడి సత్తాను యావత్ ప్రపంచానికి చాటి చెప్పిన రామోజీరావు చిరస్మరణీయులని పేర్కొన్నారు.

## తెలుగు సాహిత్య అభివృద్ధికి నిత్యం కృషి చేసిన రామోజీరావు

### -ఆంధ్ర ప్రదేశ్ మీడియా ఫెడరేషన్ నివాళి

విజయవాడ, **జూన్ 8 ( వార్త ప్రభ ప్రతినిధి ):** ఈనాడు దినపత్రిక అధిపతి రామోజీ రావు గారి ఆకస్మిక మృతి కి ఆంధ్ర ప్రదేశ్ మీడియా ఫెడరేషన్ తీవ్ర సంతాపం తెలిపింది. శనివారం ఉదయం ఆకస్మిక మరణం పొందిన రామోజీరావు దేశంలో పత్రికా స్వేచ్ఛను కాపాడాలని ఎంతో కృషి చేశారని ,పత్రికా రంగంలో నూతన ఒరవడి సృష్టించి ఎందరో జర్నలిస్టులను తయారుచేసి తెలుగు సాహిత్యా అభివృద్ధికి నిత్యం కృషిచేసిన రామోజీరావు మృతికి తీవ్ర సంతాపాన్ని తెలియజేస్తున్నాం ఆంధ్ర ప్రదేశ్ మీడియా ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి పి.ఢిల్లీ బాబు రెడ్డి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. జర్నలిస్ట్ లకు రామోజీరావు ఒక స్ఫూర్తి అని ఆయన అన్నారు. రామోజీరావు మరణం పత్రికా రంగానికి తీరని లోటని ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ నాయకులు వి.ప్రసాద్ కుమార్ అన్నారు.

## రామోజీ మృతి పత్రికా రంగానికి తీరనిలోటు

### ఆయన పేరు చిరస్థాయిగా నిలిచేలా ఉభయ తెలుగు పాలకులు చర్యలు చేపట్టాలి

సీనియర్ జర్నలిస్టు సంఘ రాష్ట్ర నేత నిమ్మరాజు చలపతిరావు

గుంటూరు, జూన్ 8: తెలుగు మీడియా మొఘల్ గా వినుతికెక్కిన ఈనాడు పత్రిక అధిపతి చెరుకూరి రామోజీరావు మృతి పత్రికా రంగానికి తీరనిలోటని సీనియర్ జర్నలిస్ట్, ఉమ్మడి రాష్ట్ర ప్రెస్ అకాడమీ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు నిమ్మరాజు చలపతిరావు ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తపరిచారు. అటు పత్రికా, ఇటు ఎలక్ట్రానిక్ మీడియా రంగాలను వినూత్న రీతిలో తీర్చిదిద్దిన అక్షరయోధుడని నివాళి అర్పించారు. రామోజీ నిష్క్రమణతో తెలుగు పత్రికా రంగం ఒక దిక్సూచిని కోల్పోయినట్లు అయిందన్నారు. తెలుగు పత్రికారంగానికి జవసత్వాలు చేకూర్చేలా వృత్తి విలువలు, ప్రమాణాలు, భాషా నైపుణ్యాల పెంపుదలకు నిరంతరం శ్రమిస్తూ, వేలాదిమంది పాత్రికేయులను పత్రికా లోకానికి అందించిన ఘనత రామోజీకే దక్కుతుందని ఆయన పేర్కొన్నారు. తెలుగు పత్రికా రంగంలో నూతన ఒరవడి సృష్టించిన రామోజీ పేరు చిరస్థాయిగా నిలిచేలా ఉభయ తెలుగు రాష్ట్ర ప్రభుత్వాల అధినేతలు తగిన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీకి రామోజీ పేరిట నామకరణం చేయాలని చలపతిరావు సూచించారు.

## రామోజీరావుకు ఘన నివాళు లర్పించిన ఏపీడబ్ల్యూజేఎఫ్

**విజయవాడ, జూన్ 8 ( వార్త ప్రభ ప్రతినిధి ):** తెలుగు నాట ప్రింట్, బ్రాడ్ కాస్ట్ మీడియాలకు సంబంధించిన ఈనాడు ఈటీవీతోపాటు అనేక వాణిజ్య సంస్థలను సృష్టించి, కొత్త పుంతలు తొక్కించిన చెరుకూరి రామోజీరావు మృతి పట్ల నేషనల్ అలయన్స్ ఆఫ్ జర్నలిస్ట్ ( ఎన్ఏజే ) అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్కే పాండే, ఎన్ కొండయ్య ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్( ఏపిడబ్ల్యూజేఎఫ్) అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ వెంకట్రావు, జి ఆంజనేయులు, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ (ఏపీ బీజేఏ) కన్వీనర్లు వి శ్రీనివాసరావు, కే మునిరాజు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. మీడియాలో కొత్త వరవడి సృష్టించి సాహితీ రంగానికి ఎనలేని సేవ చేసిన రామోజీరావు మరణం విచారకరం. తెలుగు భాషకు అమోఘమైన సేవ చేశారు. వాడుక భాషను వినియోగంలోకి తీసుకురావడంలో కీలక భూమి పోషించడం ద్వారా ఆ పత్రికలను పాఠకులకు చేరువచేసి పెద్ద సంఖ్యలో పాఠకులను తయారు చేసిన ఘనత రామోజీరావుదే. ఆయన మృతి పట్ల ఎన్ఏజే, ఏపీడబ్ల్యూజేఎఫ్, ఏపీ బీజేఏలు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశాయి.





## ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న

- అరిపిరాల మాజీ సర్పంచ్ రావుల మమత జగదీష్ రెడ్డి
- గ్రామానికి ఫ్రీజర్ బాక్స్ డొనేట్




**తొర్రూర్ జూన్ 8(వార్తా ప్రభ)**ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్న అని అరిపిరాల గ్రామ మాజీ సర్పంచ్ రావుల మమత జగదీష్ రెడ్డి అన్నారు. శనివారం అరిపిరాల గ్రామపంచాయతీకి ఫ్రీజర్ బాక్స్ ను డొనేట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా రావుల మమత జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తన ఉన్నదాంట్లోనే ఎంతో కొంత ఇతరులకు సాయం చేయడంతో సమాజంలో పేదరికం దారిద్రం అనాధలు అభాగ్యులు ఉండరని వారన్నారు. కావున ప్రతి వ్యక్తి కూడా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టిన సామాజిక కార్యక్రమాలకు దోహదపడే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని వారు సూచించారు. గతంలో ఏకగ్రీవంగా సర్పంచ్ గా ఎన్నికైన నాటి నుండి నేటి వరకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేయడం జరిగిందని. అరిపిరాల గ్రామం నుండి కర్కాల వెళ్లే రోడ్డు కొరకు తన సొంత డబ్బులతో భూమి కొనుగోలు చేసి రోడ్డు పనులు చేయించానని. పెద్ద చెరువు ఎస్సారెస్పీ కెనాల్ కాలువ, శివాలయం ప్రహరీ గోడ, జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో వాటర్ ప్లాంట్ , బీరువాలు, గ్రామంలో సిసి కెమెరాలు,సెంట్రల్ లైటింగ్, బతుకమ్మ గాట్ విగ్రహం,హెల్త్ సబ్ సెంటర్ దగ్గర రేకుల షెడ్డు ఏర్పాటు చేశానన్నారు. వీటి కొరకు దాదాపు 20 లక్షలకుల పైన రూపాయలు తన సొంత డబ్బులు ఖర్చు చేసి గ్రామాభివృద్ధికి తోడ్పాటున అందించడం జరిగిందన్నారు.రావుల మమత జగదీష్ రెడ్డి గా మా మా ద్వారాసహాయం ఉందని కుటుంబం గ్రామంలో లేదని అన్నారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా మమతా జగదీశ్వర్ రెడ్డి గా ఎల్లవేళలా మా సహాయ సహకారాలు గ్రామానికి ఉంటాయని వారు తెలిపారు. కావున గ్రామంలో ఉన్న ప్రతి వ్యక్తి కూడా ఇలాంటి కార్యక్రమాలకు మీ అందరి సహకారం ఉండాలని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వల్లపు మల్లయ్య,డిసిసిబి డైరెక్టర్ వల్లపు లింగయ్య, సుంచు సంతోష్, చెవిటి సుధాకర్, వల్లపు ఐలోని, తోట మురళి, పాషా, అశోక్, యువజన సంఘం అధ్యక్షులు సభ్యులు గ్రామ కార్యదర్శి ఆరేళ్ల దేవయ్య, శ్రీను, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## స్ఫూర్తిప్రదాత రామోజీరావు

### -విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఏపీయూడబ్ల్యూజే నేతలు నివాళి



**విజయవాడ, జూన్ 8 ( వార్త ప్రభ ప్రతినిధి ):**మీడియా మొగల్, ఈనాడు సంస్థల అధినేత, పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత చెరుకూరి రామోజీరావు మరణం పత్రికా రంగానికే కాక, తెలుగు రాష్ట్రాలకు తీరని లోటని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐ.వి.సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్ ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళుర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు జర్నలిజానికి జాతీయస్థాయిలో ఒక గుర్తింపును, గౌరవాన్ని తీసుకురావడమేగాక, జిల్లా పేజీలతో స్థానిక వార్తలకు అత్యంత ప్రాధాన్యనిచ్చి తెలుగు పత్రికారంగంలో ఒక నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిన స్ఫూర్తి ప్రధాత అని కొనియాడారు. అలాగే తెలుగు భాష సంరక్షణకు, సాహిత్యాభివృద్ధికి విశేష కృషి చేశారని, రంగం ఏద్కెనా విలువలకు, విశ్వసనీయతకు పెద్దపీట వేసిన వ్యక్తి రామోజీరావు అని శ్లాఘించారు. ఆయన మృతి పత్రికారంగానికి తీరని లోటని పేర్కొన్నారు. ఏపీయూడబ్ల్యూజే విజయవాడ యూనిట్ అధ్యక్షులు చావా రవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జయప్రకాష్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కంచల జయరాజ్, ఐజేయూ సభ్యులు షేక్ బాబు, స్టేట్ కౌన్సిల్ సభ్యులు దారంవెంకటేశ్వరరావు, సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ రమణారెడ్డి, ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు సాంబశివరావు, విజయవాడ యూనిట్ కార్యవర్గ సభ్యులు రత్నాకర్, హుస్సేన్, కుమార్, తిరుమలరావు, శ్రీనివాస్, భద్రం, నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## ఉచిత చేప మందు పంపిణీ

### వివిధ గ్రామాలను తరలివచ్చిన ప్రజలు



**ఇబ్రహీంపట్నం జూన్ 08(వార్తా ప్రభ ప్రతినిధి):-** ఉబ్బసం దగ్గు శ్వాసకోశ వ్యాధులకు మృగశిరకార్తె ప్రవేశం సందర్భంగా శనివారం నాడు కొండపల్లిలో ఉచిత చేప మందు పంపిణీ చేశారు. దివంగత జనాబ్ హాజి హకీమ్ మొహమ్మద్ యూసఫ్ అలి మనుమలు మొహమ్మద్ మసూద్ అలి జిన్నా, మొహమ్మద్ మహమూద్ అలీలు ఈ చేప మందును పంపిణీ చేశారు. ఆస్తమా వ్యాధిగ్రస్తుల్లో శ్వాసనాళ్ళాలు బిగుసుకుపోవడం వల్ల శ్వాసక్రియ సరిగా జరగదు. శ్వాస నాళ్ళలలోని కండరాలు బిగుతుగా మారడం, లోపల కఫం పేరుకుపోవడం వల్ల, ఇబ్బంది ఎదురయ్యి ,దగ్గు, ఆయాసం, ఛాతి బిగబట్టడం పిల్లికూతలు రావడం జరుగుతుంది. వీటికి చేప మందు దివ్య ఔషధంగా పనిచేస్తుంది. 1920 వ సంవత్సరము నుండి జనాబ్ హాజి హకీమ్ మొహమ్మద్ యూసుఫ్ అలీ ప్రతి సంవత్సరం ఉచితంగా అందజేస్తున్నారు. చేప ముందు వేయించుకున్న వారు మూడు సార్లు తగ్గకుండా సంవత్సరమునకు ఒకసారి చొప్పున, మూడు సంవత్సరములు, వేయించుకొనవలెనని తెలిపారు. వనమూలికల తో తయారు చేసిన మందును చేపకు పెట్టి మింగించటం జరిగింది. చేపతో వేసుకొని వారికి, శాఖహరులకు మందు అనుపానముతో ఇవ్వడం జరిగింది. కృష్ణ, ఎన్టీఆర్ గుంటూరు ,ఖమ్మం, కోదాడ, తూర్పు, పశ్చిమగోదావరి, ప్రకాశం జిల్లాల నుండి ఆస్తమా వ్యాధిగ్రస్తులు వచ్చి ఈ చేప మందును వేయించుకున్నట్టు వారు తెలిపారు. చేప మందు వేయించుకున్న వారు జున్నుపాలు వాలగ చేప, బూడిద గుమ్మడికాయ, వంకాయ, గోంగూర నీ దీర్ఘకాలం వాడకూడదని తెలిపారు.



రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో విజయం సాధించిన గాజువాక శాసన సభ్యులు పల్లా శ్రీనివాస్ యాదవ్ కి అభినందనలు తెలియజేస్తున్న విజయవాడ మాజీ కార్పొరేటర్ డాక్టర్ కాకు మల్లికార్జున యాదవ్ **-వార్తా ప్రభ, విశాఖపట్నం**

# కుటుంబ పింఛను ధ్రువపత్రాలు అందజేత



**కాకినాడ,జూన్ 8 (వార్తాప్రభ) :** ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కుటుంబ పింఛను ధ్రువపత్రాలు పంపిణీ జరిగింది. సంఘం నెలవారీ సమావేశం పెన్షనర్ భవన్ లో జరిగింది. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షులు కె.పద్మనాభం మాట్లాడుతూ ప్రభుత్వ పెన్షనర్ అనంతరం వారి నామిని కుటుంబ సభ్యులకు పింఛను మంజూరులో వివిధ కారణాలతో ఆలస్యం చోటుచేసుకుందని సంఘం బాధ్యత వహించి సభ్యులు పింఛను మంజూరులో చొరవ చూపిందన్నారు. 22మందికి కుటుంబ పింఛను మంజూరు ధ్రువపత్రాలు అందించారు.ప్రధాన కార్యదర్శి నూకరాజు మాట్లాడుతూ మనం-మనకోసం పథకంలో 65-75 సంవత్సరాల వయస్సు ఉన్నవారంతా జేరుటకు అర్హత ఉందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు శాస్త్రి మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడినందున పింఛను దారుల సమస్యలు పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని అన్నారు.సుమారు 300మంది సభ్యులు హాజరయ్యారు. ఈకార్యక్రమంలో పి.రమణ,నిత్యానంద రావు, భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీకి మోటేపల్లి రత్నరావు రాజీనామా

● రాజకీయాలకు దూరంగా ఉంటాను.



**పెడన,జూన్ 8 (వార్తాప్రభ) :** ఇప్పటివరకు కమ్యూనిటీ బేస్ గా రాజకీయాలు చేసిన మోటేపల్లి రత్నరావు వైసీపీకి రాజీనామా చేశారు. గూడూరు గ్రామానికి చెందిన రత్నరావు దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యునిగా సకార్ బ్యాంకు జిల్లా డైరెక్టర్గా పని చేస్తున్నారు. రాజకీయాలంటే ఒకరకంగా విరక్తి పుట్టిందని ఆయన అంటున్నారు. గత ఐదు సంవత్సరాలుగా తాను ఎన్నో అవమానాలు భరించారని ఆవేదన చెందారు. గత ఐదు సంవత్సరాలుగా తన మీద ఎన్నో పిటిషన్లు పెట్టారని అన్నారు. తాను మంచి చూస్తున్న గుర్తింపు లేకుండా పోతుందని ఆవేదన చెందారు. ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయాలనుంచి వైదొలగటమే సరైన నిర్ణయం అని భావించానని అన్నారు. రాజకీయాల్లో ఉన్నా లేకున్నా తనకు ఇబ్బంది లేదని సామాజిక సేవలు చేస్తూనే ఉంటానని తెలిపారు. తనకు వంగవీటి మోహనరంగారావు ఆదర్శవని అన్నారు. మెగాస్టార్ చిరంజీవి అంటే అభిమానం అన్నారు.ఆ ఉద్దేశంతోనే వేదవ్యాస్ గారితో పాటు ప్రజా రాజ్యం పార్టీలో చేరానని చెప్పారు. తన బంధువులు స్నేహితులు అందరూ కూడా వేరే పార్టీలో ఉన్నారని అందువల్ల వారితో తనకు సంబంధాలు తెగిపోయాయి అని ఆవేదన చెందారు. భవిష్యత్తులో శుభకార్యాలకు కూడా పిలిచేటట్టుగా లేరు అని అన్నారు.కింది స్థాయి నుంచి పై స్థాయికి వచ్చిన తాను ఇకపై సామాజిక సేవా కార్యక్రమాలలో ఉంటానని తెలిపారు. ఇప్పటివరకు తనకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ తన వల్ల ఎవరైనా ఇబ్బంది పడితే క్షమించవలసిందిగా కోరారు.

# సహకార సంఘాల పాలకవర్గాలకు మంగళం పాడిన రాష్ట్ర ప్రభుత్వం



**పెడన,జూన్ 8 (వార్తాప్రభ) :** నామినేటెడ్ పదవుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. గత ఐదు సంవత్సరాలుగా పార్టీకి సేవలు అందించిన వారు పదవుల కోసం కాచుకూర్చున్నారు. ప్రభుత్వం మారడంతో నామినేటెడ్ పోస్టులపై అందరికి కన్నుపడింది. ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న టిడిపి నాయకులు కార్యకర్తలకు ఆ రోజు రానే వచ్చింది. రాష్ట్రంలో ఉన్న అన్ని నామినేటెడ్ పదవులకు సంబంధించిన వైసీపీ వారిని రాజీనామా చేయించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు శనివారం నాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయా నియోజకవర్గాల్లో ఉన్న నామినేటెడ్ పోస్టులు అనుభవిస్తున్న వారు పదవులకు రాజీనామా చేయవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. చేసిన రాజీనామాలను వెంటనే ఆమోదించాలని కూడా ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. కష్టపడిన కార్యకర్తలకు ఎక్కువమందికి న్యాయం చేసే పదవులు కొన్ని ఉన్నాయి. సహకార సంఘాలు ఈ కోవలోకి వస్తాయి. జిల్లాలో 213 సంఘాలు రైతులకు సేవలు అందిస్తున్నాయి. గత ఐదు సంవత్సరాలుగా ఈ పదవులను వైసిపి వారు ఎన్నికలు లేకుండా అనుభవిస్తున్నారు. ఆ తర్వాత మార్కెట్లు యార్డ్ లు గుళ్ళు గోపురాలు ఆయా కార్పొరేషన్ల డైరెక్టర్లు చైర్మన్ ల పదవులను ఇప్పటివరకు అనుభవిస్తున్న వారు రాజీనామా చేయనున్నారు. అనంతరం వీటి భర్తీపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించనుంది. ప్రభుత్వం త్వరలోనే కొలువుదీరనుంది. అనంతరం వీటిపై దృష్టి కేంద్రీకరించే అవకాశం ఉంది.

# జూనియర్ లెక్చరర్స్ పదోన్నతులు కల్పించాలి - డిటిఎఫ్ డిమాండ్



**విజయవాడ,జూన్ 8 (వార్తాప్రభ) :** విజయవాడ నగరంలోని స్థానిక గాంధీ నగర్ లోని ఎన్జీవో హోం నందు రాష్ట్ర డిటిఎఫ్ 17వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం ఏర్పాటు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు గోట్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా అర్హులైనటువంటి స్కూల్ అసిస్టెంట్లకు జేఎల్ పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు రాష్ట్రంలో ఉపాధ్యాయులు మానసికంగా కృంగిపోయారన్నారు గత కొద్ది సంవత్సరాలుగా నిలబడిపోయినటువంటి అరుణలెడుకు సంబంధించిన క్యాష్ చేయడంలో గాను, ప్రావిడెంట్ లోన్లను కూడా వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ డిమాండ్ చేశారు. ఈ కాలంలో ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో డిటిఎఫ్ రాష్ట్ర నాయకులు రమణయ్య జార్జ్, నరహరి, వరుణ్ కుమార్ లు పాల్గొన్నారు.

# జావిద్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న బీసీ ఐక్యవేదిక నేత భేరి రామచందర్ యాదవ్



**హైదరాబాద్,జూన్ 8 (వార్తాప్రభ) :** బ్రదర్స్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు అందేలా కిషోర్ యాదవ్ ఆధ్వర్యంలో జావిద్ జన్మదిన వేడుకల కార్యక్రమంలో జాతీయ బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు భేరీ రామచంద్ర యాదవ్, యువజన విభాగం అధ్యక్షులు అందెల కుమార్ యాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా భేరీ రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ యువత మంచి మార్గంలో నడవాలని, విద్య ఉపాధి రాజకీయ రంగాల్లో ముందంజలో ఉండాలని, సమాజంలో విలువలతో బతకాలని, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని అన్నారు. యువత స్ఫూర్తితో మార్గదర్శకంగా బతకాలని అన్నారు. జావేద్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ మంచి మార్గంలో పయనిస్తూ అభివృద్ధి పథాన ముందడుగు వేస్తూ ఆర్థికంగా శారీరకంగా మానసికంగా బలోపేతంగా ఉండాలని అన్నారు. ఈ జన్మదిన వేడుకల్లో గఫార్, పులి సాయి యాదవ్, విజయ్ యాదవ్, నరసింహ, పవన్, కే మధు యాదవ్, పోతరాజు, పి శివకుమార్ యాదవ్, యాదయ్య, మనోహర్ యాదవ్, యువజన నాయకులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు

# రామోజీ గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు మృతి బాధాకరం

● రామోజీరావు జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శం ● టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు



**విజయవాడ,జూన్ 8 (వార్తాప్రభ) :** రామోజీ గ్రూప్ సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. సామాన్య రైతు కుటుంబంలో పుట్టి స్వయంకృషితో కష్టపడి అంచలంచెలుగా ఎదిగిన వ్యక్తి రామోజీరావు. ఈనాడు దినపత్రిక స్థాపించి తెలుగు పత్రికా ప్రపంచంలో నవ శకానికి నాంది పలికారు. ఈనాడు మీడియా సంస్థ ద్వారా నిజాలను నిర్భయంగా ప్రసారం చేసి సమాజాన్ని చైతన్యం చేశారు. ఈనాడు ముందడుగు ద్వారా సామాన్యులకు చేరువగా సమాచార హక్కు చట్టం, సుజలాం, సుఫలాం అంటూ పరిశుభ్రత కోసం ఊరూవాడా చైతన్యం వంటి సామాజిక కార్యక్రమాలు చేపట్టారు.ఆయన మృతి మీడియా రంగానికి, తెలుగుజాతికి తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# సాగరం బాగుంటేనే సకల జీవరాశులు బాగుంటాయి

● జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.జె.నరసింహ నాయక్




**కాకినాడ,జూన్ 8 (వార్తాప్రభ) :** ప్రపంచ సముద్ర దినోత్సవం సందర్భంగా మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్సైన్సెస్, ఓషన్ సొసైటీ ఆఫ్ ఇండియా సహకారంతో రామచంద్రాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రేడియో అల 90.8 ఎఫ్.ఎం,మలిరెడ్డి చారిటబుల్ ట్రస్టుల సంయక్త ఆధ్వర్యంలో శనివారం కాకినాడ ఎన్.టి.ఆర్ బీచ్ పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.జె.నరసింహ నాయక్ బీచ్ పరిశుభ్రతా కార్యక్రమాన్నిలాంఛనంగా ప్రారంభించి మాట్లాడుతూ సాగరం బాగుంటేనే సకల జీవరాశులు బాగుంటాయనే విషయాన్ని విస్మరించరాదని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ తదితర వ్యర్థాలతో సముద్రాలను కలుషితం చేయడం వలన పర్యావరణ సమతుల్యతను సర్వనాశనం అవుతుందన్నారు. రెడ్ క్రాస్ కాకినాడ జిల్లా శాఖ ఛైర్మన్ వై.డి.రామారావు మాట్లాడుతూ అవగాహనా రాహిత్యంతో సముద్రాలతో పాటు తీర ప్రాంతాలను కాలుష్యకారకాలుగా మార్చడంవలన విపత్తులను ఎదుర్కోవలసివస్తుందన్నారు. హెల్త్, ఎడ్యుకేషన్,న్యూట్రీషన్ (హెన్) ప్రాజెక్ట్ ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.ఎన్.మూర్తి మాట్లాడుతూ పర్యావరణ పరిక్షణ పట్ల అవగాహనకు యువతలో చైతన్యం రావాలని ఆకాంక్షించారు. ప్రముఖ వైద్యులు డా.కాద వెంకట రమణ మాట్లాడుతూ ప్రకృతిలో మనకు లభిస్తున్న ప్రాణవాయవు నూటికి 70శాతం సముద్రాలలో జీవించే అల్గేల వలన మనకు లభిస్తుందని తెలిపారు.సముద్ర జలాలలో వ్యర్థాలను విడుదల చెయ్యడం వలన సముద్రంలో జీవించే జీవరాశులు అంతరించిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రముఖ సామాజిక వేత్త వక్కలంక రామకృష్ణ మాట్లాడుతూ సముద్రాలలో వ్యర్థాలు కలవకుండా జాగ్రత్తపడవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఓషన్ సొసైటీ ఆఫ్ ఇండియా కాకినాడ చాప్టర్ కో-ఆర్డినేటర్ డా.ఎన్.శ్రీనివాస్ మాట్లాడుతూ సముద్రాల పరిరక్షణకు సమిష్ట కృషి అవసరమన్నారు. విశ్రాంత జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. డి.వి.వి.సత్యనారాయణ (వీరు) మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మలిరెడ్డి చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ ఎం.వి.ఆర్.ఫణీంద్ర, రామచంద్రాపురం ప్రభుత్వ కళాశాల కంప్యూటర్ సైన్స్ లెక్చరర్ డా. శోభారాణి, కాకినాడ పి.ఆర్.ప్రభుత్వ కళాశాల ఎన్.ఎస్.ఎస్. కో-ఆర్డినేటర్లు డా.ఎం.పాండురంగారావు, డా. ఎం.కృష్ణారావు, జి.పావని, సామాజిక కార్యకర్త అల్లూరి సురేంద్ర, ఎన్.ఎస్.ఎస్, ఎన్.సి.సి క్యాడెట్లు పాల్గొన్నారు.

# నానాజీ శంఖవరం అల్లుడే ...

● కాకినాడ జిల్లాలో ఆయనదే అఖండ విజయం ● తొలిసారిగా అసెంబ్లీలో అడుగు పెట్టనున్న 'పంతం' ● శంఖవరంలో సంబరాలు





**శంఖవరం,జూన్ 8 (వార్తాప్రభ) :** 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎన్ డి ఏ కూటమి తరపున జనసేన పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి కాకినాడ జిల్లాలో అత్యధిక మెజార్టీతో పంతం వెంకటేశ్వరరావు (నానాజీ)విజయం సాధించారు. ఎన్ డి ఏ కూటమిలో జనసేన పార్టీ నుంచి కాకినాడ రూరల్ నియోజకవర్గం నుంచి గెలుపొందిన ఆయన శంఖవరం గ్రామానికి అల్లుడే... రాజకీయాలకు పుట్టినిల్లు లాంటిది శంఖవరం... ఇప్పటికే ప్రత్తిపాడు నియోజవర్గంనికి ఐదుగురుని ఎమ్మెల్యేలుగా అందించిన గ్రామం శంఖవరం...అదే మాదిరిగా శంఖవరం గ్రామానికి చెందిన ల్యాండ్ లార్డు చింతంనీడి రాజారావు కుమారుడు చింతంనీడి కృష్ణ మోహన్, సావిత్రి దంపతుల పెద్ద కుమార్తె అరుణను వివాహం చేసుకున్నారు. దీని ద్వారా శంఖవరం గ్రామం అల్లుడు అయ్యారు.కాకినాడ రూరల్ కి ఎమ్మెల్యే శంఖవరం గ్రామానికి చెందిన వారి అల్లుడు ఎమ్మెల్యేగా అయ్యారు.ఇది శంఖవరం గొప్పతనం. పంతం నానాజీ కి 1,34,414 ఓట్లు రాగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కన్నబాబుపై 72,040 ఓట్లు అత్యధిక మెజారిటీతో గెలిచారు.జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కంటే పంతం నానాజీ కి 1761 ఓట్లు ఎక్కువ. కాకినాడ జిల్లాలోనే అత్యధిక మెజారిటీ పంతం నానాజీ ది. గత ఐదు సంవత్సరాలుగా జనసేన పార్టీ రాష్ట్ర అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాలుతో పార్టీ గెలుపుకు కాకినాడ జిల్లా పార్టీ అధ్యక్షుడు పనిచేస్తూ పార్టీ గెలుపుకు అవిశ్రాంతంగా పని చేశారు.2019 అసెంబ్లీ ఎన్నికల్లో అదే కాకినాడ రూరల్ నియోజకవర్గం నుంచి వైకాపా అభ్యర్థి కన్నబాబుపై పోటీ చేసి ఓడారు. మరల 2024 ఎన్నికలలో మాజీ మంత్రి వైసీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబుపై పోటీ చేసి భారీ మెజార్టీతో నానాజీ గెలుపొందారు.దీనితో తొలిసారిగా శాసనసభలోకి అడుగు పెట్టనున్నారు.ఆయనకు జిల్లాలో మంచి పేరుంది.ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ వారి సాదక బాధలు తెలుసుకుంటూ నిత్యం ప్రజల్లో ఉండేవారు.అలాంటి వ్యక్తికి ఈ ఎన్నికల్లో ప్రజలు బ్రహ్మరథం పట్టి అఖండ మెజారిటీతో విజయం అందిచి కాకినాడ రూరల్ నియోజకవర్గం ప్రజలు రుణం తీర్చుకునే అవకాశం ప్రజలు కల్పించారు.

# పెన్సిల్ తో ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ ఫోటో



**పెడన,జూన్ 8 (వార్తాప్రభ) :** పెడన పట్టణానికి చెందిన ఓ విద్యార్థి ఎమ్మెల్యే ఫోటోను పెన్సిల్తో గీసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. స్థానిక నాలుగో వార్డుకు చెందిన రషీద్ కుమారుడు అబ్దుల్ మల్లిక్ అనే విద్యార్థి ఈ ఘనతను సాధించాడు. శాసనసభ్యునిగా కృష్ణ ప్రసాద్ విజయభేరి మోగించిన తర్వాత ఈ విద్యార్థి పెన్సిల్ తో ఈ ఆర్ట్ ను వేశాడు. చిత్రపటాన్ని తీసి వెళ్లి శాసనసభ్యునికి బహుమతిగా అందజేశాడు. పలువురు విద్యార్థిని అభినందించారు.

# రామోజీరావు మృతి పట్ల మల్లాది విష్ణు సంతాపం



**విజయవాడ సెంట్రల్,జూన్ 8 (వార్తాప్రభ) :** ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. తెలుగు పత్రికా రంగానికి దశాబ్దాలుగా ఆయన అందించిన సేవలు ఎనలేనివని తెలిపారు. రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

# విద్యా కానుక సామగ్రి సరఫరా పై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపాలి

● ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ ( ఎన్.టి.ఎ) విజ్ఞప్తి

**విజయవాడ, జూన్ 8 (వార్తాప్రభ) :** పాఠశాలలకు సరఫరా కాబడిన "విద్యాకానుక కిట్ల"లో రూ.150 కోట్ల దోపిడీ జరిగిందని ఆరోపణలు వినవస్తున్నాయని, మేధావులు, విద్యావేత్తలు భావిస్తున్నారు కావున ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి అందుకు బాధ్యులు అయిన అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ (ఎన్.టి.ఎ) రాష్ట్ర అధ్యక్ష ,కార్యదర్శులు కరణం హరికృష్ణ ,మాగంటి శ్రీనివాస రావు లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వారికి ప్రకట ద్వారా విజ్ఞప్తి చేశారు.విద్యా కానుక కిట్లకు టెండర్లు నిర్వహించకుండానే గుత్తేదారులకు నామినేషన్ పద్ధతిలో రూ.772 కోట్ల సామగ్రి సరఫరా బాధ్యతలు అప్పగించడం జరిగిందని ప్రజా సంఘాలు భావిస్తున్నాయని తెలిపారు.విద్యార్థుల సంఖ్య కంటే అదనంగా 9.31 లక్షల కిట్లు కొనుగోలు చేయడం జరిగిందని వివిధ పత్రికలు గగ్గోలు పెడుతున్నాయని విశదీకరించారు.మార్కెట్లో కాగితం ధర తగ్గినా పాత ధరకే గుత్తేదారులకు మొత్తాన్ని చెల్లించడం జరిగిందని మేధావులు విశ్లేషిస్తున్నారని చెప్పారు.నోటు పుస్తకాలలో కాగితం నాణ్యత లేకపోవడం , 2023-24 విద్యా సంవత్సరంలో సరఫరా కాబడిన బ్యాగులు నాణ్యత లేవని ఆరోపణలు ఉన్నట్లు తెలిపారు.పాఠశాలలకు సరఫరా కాబడిన "విద్యా కానుక"కిట్లకు సంబంధించి ప్రజా ప్రయోజనాల దృష్ట్యా సత్వర సమగ్ర విచారణ జరిపి అందుకు బాధ్యులైన అధికారులపై సత్వర చర్యలను తీసుకోవాలని కోరారు.

# అక్షర శిల్పి రామోజీరావు మరణ వార్త అత్యంత బాధాకరం

● నూజివీడు శాసనసభ్యులు కొలుసు పార్థసారథి



**నూజివీడు,జూన్ 8 (వార్తాప్రభ) :** తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఈనాడు అధినేత రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నూజివీడు శాసనసభ్యులు కొలుసు పార్థసారథి నివాళులు అర్పించారు.అనంతరం సారథి మాట్లాడుతూ తెలుగు జర్నలిజాన్ని ఓ మలుపు తిప్పిన ఘనత రామోజీరావు కి దక్కుతుందన్నారు. పత్రికను మారుమూల గ్రామాలకు సైతం చేర్చి, స్థానిక వార్తలకు ప్రాధాన్యం కల్పించారన్నారు. ప్రత్యేకంగా తెలుగు భాష అభివృద్ధికి జర్నలిజం ద్వారా కృషి చేశారన్నారు. 88ఏళ్ల వయస్సులోనూ క్రమశిక్షణ, నిబద్ధత, సమయపాలన నడుచుకునే ఆయన ఎంతో మందికి స్ఫూర్తిదాయకమాన్నారు. ఈనాడు గ్రూపు సంస్థల స్థాపనతో వేల మందికి ఉపాధి కల్పించారు. మీడియా రంగంలో రామోజీ ది ప్రత్యేకమైన శకమన్నారు. రామోజీఫిల్మ్ సిటి ప్రపంచంలోనే గర్వంగా చెప్పుకునే మన తెలుగురాష్ట్రాల్లో ఉన్న స్టూడియో. మార్గదర్శి, ప్రియా ఫుడ్స్ ఇలా ఎన్నో సంస్థల ద్వారా ఎంతో మందికి ఉపాధికల్పించారని సారధి కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీల నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, తెలుగు మహిళలు జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

# అక్షర శిల్పి ఈనాడు రామోజీరావు మృతి బాధాకరం..

● మృతి దిగ్భ్రాంతికి గురి చేసింది : ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



**గుడివాడ,జూన్ 8 (వార్తాప్రభ) :** లక్షలాది మందికి, దిశా దశ చూపించిన మాహా మార్గదర్శ "అక్షర వృక్షం".. ఆ మాహానుభవుడికి వినమ్ర పూర్వక అక్షరాంజలి సమర్పిస్తూ, వారి ఆత్మకు శాంతి కలగాలని , కోరుకుంటున్నా అంటూ ఎమ్మెల్యే రాము రామోజీరావు మరణానికి సంతాపం తెలిపారు. అక్షర శిల్పి ఈనాడు రామోజీరావు మృతి బాధాకరం.. ఆయన మృతి దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఈ క్రమంలో రామోజీరావు మృతికి గుడివాడ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ తరపున ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నామన్నారు. మీడియా రంగంలో లెజెండ్ ఆయన రామోజీరావు మన గుడివాడ ప్రాంత వాసి కావడం మనందరికీ గర్వకారణమన్నారు. పునరపి జననం -పునరపి మరణం అన్నట్లు.. పుట్టిన వారందరూ చనిపోతారు.. కానీ చిరకాలం గుర్తుండిపోయేవారు కొందరే.. అలాంటి వారిలో రామోజీరావు ఒకరన్నారు. ముఖ్యంగా ఆయన అకాల మరణం సమాజానికి, జర్నలిజానికి ఎవ్వరూ తీర్చలేని నష్టమన్నారు. సామాన్య రైతు కుటుంబంలో పుట్టి స్వయంకృషితో కష్టపడి అంచలంచెలుగా ఎదిగిన వ్యక్తి రామోజీరావు అని, ఈనాడు మీడియా సంస్థ ద్వారా నిజాలను నిర్భయంగా ప్రసారం చేసి సమాజాన్ని చైతన్యం చేశారు. ఆయన కలల సౌధం నుండి పుట్టిన రామోజీ ఫిలిం సిటీ నిర్మాణం మన తెలుగు రాష్ట్రాలకే గర్వకారణం. రామోజీ ఫిలిం సిటీ.. ఈనాడు, ఈటీవీ గ్రూప్ సంస్థల ద్వారా వేలాదిమందికి ప్రత్యక్షంగా.. లక్షలాదిమందికి పరోక్షంగా నిత్యం ఉపాధి కల్పిస్తున్న మహనీయుడు రామోజీరావు అన్నారు. ఎన్నో సందేశాత్మకమైన చిత్రాలు రూపొందించి.. సినీ రంగంలో తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరచుకున్న మహనీయుడు.. పుట్టిన గడ్డ కోసం ఎంతో కృషిచేసిన ఆదర్శప్రాయుడు. ఆయన మృతి మీడియా రంగానికి, తెలుగుజాతికి తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నారు.

# రామోజీ రావు మృతి పత్రికా రంగానికి తీరని లోటు -సాహితివేత్త వసుధ..

**గుడివాడ,జూన్ 8 (వార్తాప్రభ) :** ఈనాడు పత్రిక ద్వారా తెలుగు పత్రికా రంగ విస్తృతి కి, తెలుగు భాషా సాంస్కృతికాభివృద్ధికి అవిరళ కృషి చేసిన ఈనాడు సంస్థల చైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ చెరుకూరి రామోజీరావు మృతి పత్రికా రంగానికి తీరని లోటని కవి, రచయిత ఈనాడు పత్రిక పూర్వ సాంస్కృతిక విలేకరి గా పనిచేసిన వసుధ బసవేశ్వర రావు కొనియాడుతూ ఆయన మృతికి తీవ్ర సంతాపం తెలియజేసారు. పత్రికా రంగానికి ఆయన ఒక దిక్సూచి అని పత్రికలకు జర్నలిజానికి విలువలను, క్రమశిక్షణ ను అలవరచిన ధీశాలి అని పేర్కొన్నారు. వారి నేతృత్వంలోని ఈనాడు పత్రికను విజయవాడ ఎడిషన్ పెట్టినప్పటినుంచి చూస్తూ, తెలుగు భాషలోని ఎన్నో విషయాలను గ్రహించి, 2003 నుంచి 2008 వరకు గుడివాడ లో కల్చరల్ కంట్రిబ్యూటర్ గా విధులను గౌరవంగా గర్వంగా సంతోషంగా నిర్వహించినట్టు తెలిపారు..పత్రికా రంగంలో ఎన్నో ప్రయోగాలు చేసి పత్రికను పల్లె పట్టులలో సైతం చదివేలా చేసి జన జాగృతికి ఆయన కృషి చేసారన్నారు. పల్లె ప్రజల మనోభావాలకు సైతం పత్రికలో పెద్దపీట వేశారన్నారు. సమాజం లోని అందరి అవసరాలను తీర్చేలా పత్రికా నిర్వహణలో ఆయన చేసిన ప్రయోగాలు, ప్రచురణలు విజయవంతంగా జనామోదాన్ని పొందటం వారి అంకిత భావానికి, కృషికి, పట్టుదలకు నిదర్శనమంటూ శ్రద్ధాంజలి ఘటించారు.



**రామోజీ రావు వ్యక్తి కాదు మహా శక్తీ.. :** రామోజీ రావు వ్యక్తి కాదు మహా శక్తి అని ఆయన మరణం తెలుగు వారికీ తీరని లోటు అని అక్కినేని నాగేశ్వ రావు కళాశాల సెక్రటరీ, కరెస్పాండంట్ కే ఎస్ అప్పారావు పేర్కొన్నారు. శనివారం ఉదయం స్థానిక ఏఎన్ఆర్ కళాశాల ఆవరణలో పూర్వ విద్యార్థి రామోజీరావు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం లో ప్రెసిడెంట్ ఎఆర్కె ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్. కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శివనాధ్, లైబ్రరియన్ బిఎస్ఎస్ పద్మజ, అధ్యాపకులు, సిబ్బంది తదిరులు పాల్గొన్నారు.

# పిఠాపురం వెళుతున్న మోటూరు గ్రామ జనసేన పార్టీ నాయకులకు అభినందనలు : బూరగడ్డ శ్రీకాంత్



**గుడివాడ,జూన్ 8 (వార్తాప్రభ) :** శనివారం ఉదయం గుడివాడ రూరల్ మండలం మోటూరు గ్రామంలో జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మరియు మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు బాలశౌరీ లు అత్యధిక మెజార్టీతో గెలిచిన సందర్భంగా శక్తిపీఠంలో ఒకటైన పిఠాపురం లో వేంచేసి వున్న కోటేశ్వర స్వామివారి మొక్కు తీర్చుటకు జోగి ద్వారా తీర్చుకుని వెళుటకు సలంకాయల సత్యనారాయణ, ఘంటా రవీల ఆధ్వర్యంలో సుమారు 25 మంది జనసేన పార్టీ నాయకులు బయలుదేరి వెళుచున్నారు. ఈ క్రమంలో యాత్ర ను జనసేన పార్టీ నియోజకవర్గ ఇంఛార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బూరగడ్డ శ్రీకాంత్ మాట్లాడుతూ నాయకులు అందరూ గెలిచినందుకు మోటూరు గ్రామ జనసేన పార్టీ నాయకులు పిఠాపురం వెళుతున్న సందర్భంగా వారిని అభినందించడం జరిగిందన్నారు. నాయకులందరూ మంచి పరిపాలన అందించి ప్రజలందరికీ అందుబాటులో ఉంటారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మోటూరు గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు ఘంటా బాలాజీ, ఘంటా శివ, సాయి జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, వైస్సార్, వినోద్, సాయి కృష్ణా, వీర మహిళలు దుర్గా, రమ్య, మల్లేశ్వరీ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

